ఈనాడు
విశాఖపట్నం
బుధవారం 9 అక్టోబరు 2024


# దోపిడీలు.. దాడులు!!

- మత్తులో బీభత్సం సృష్టిస్తున్న రౌడీషీటర్లు
- కలవరం రేపుతున్న గంజాయి ప్రభావం

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, పెదవాల్తేరు



## తనిఖీల సమయంలో...

➤ ఈ ఏడాది జులైలో మానసిక వైద్యశాల రోడ్డు సర్కిల్‌లో అర్ధరాత్రి తనిఖీలు చేస్తుండగా... మద్యం మత్తులో ఉన్న ద్విచక్ర వాహన చోదకుడు పోలీసులపై దాడికి దిగాడు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అప్పారావు చెయ్యి విరిగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను హోంమంత్రి అనిత పరామర్శించారు.

➤ ఉషోదయ కూడలి సమీపంలో ఓ మహిళ 112కు ఫోన్ చేసి తన భర్త మద్యం మత్తులో వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసింది. పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ బాధితురాలి భర్త వద్దకు వెళ్లిన ఎంవీపీ కాలనీకి రాణాకు చెందిన కానిస్టేబుల్ ముఖంపై అతను మద్యం మత్తులో దాడి చేశాడు.

➤ గతేడాది డిసెంబరులో త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు మద్యం తనిఖీలు చేస్తుండగా.. ఓ చోదకుడు మద్యం మత్తులో రమేష్ అనే పోలీసును తోసేయడంతో గాయాలయ్యాయి.

దౌర్జన్యానికి పాల్పడిన గంజాయి ముఠా అరెస్టు

12లో

గంజాయి, మద్యం మత్తులో రౌడీషీటర్లు చేస్తున్న ఆగడాలకు విశాఖ వాసులు హడలిపోతున్నారు. వారిని కట్టడి చేసి ప్రజలకు భద్రత కల్పించాల్సిన రక్షకభటులకే రక్షణ కరవైంది. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మత్తులో కొందరు పోలీసు సిబ్బందిపైనే దాడులకు తెగబడుతుండటం కలకలం రేపుతోంది. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయితో తలెత్తుతున్న పరిణామాలు కలవరం రేపుతున్నాయి.

### రెచ్చిపోతున్నారు ఇలా..

➤ తగరపువలస ప్రాంతంలో గంజాయి మత్తులో ఇద్దరు రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ కల్గిన మరో ఇద్దరు కలిసి పలువురిని చితకబాది నగదు దోపిడీ చేశారు. కర్రలు, కత్తులతో నడిరోడ్డుపై హల్‌చల్ చేశారు.

➤ సాయి అనే రౌడీషీటరు కోర్టు నుంచి కేంద్ర కారాగారానికి తీసుకెళ్లిన ఎస్కార్ట్ పోలీసులపైనే గంజాయి మత్తులో దాడికి దిగారు.

➤ ఇటీవల పెందుర్తిలో ఓ రౌడీషీటర్ మహిళను ఆటోలో అపహరించే ప్రయత్నం చేయడం కలకలం రేపింది.

**ఎంత బరితెగింపు:** పోలీసులపైనే దాడులు చేస్తూ రౌడీషీటర్లు, గ్యాంగులు బరితెగించడానికి గంజాయి, మద్యం మత్తు కారణమని తెలుస్తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో చరవాణిలు, వాహనాల తాళాలు పోలీసులు స్వాధీనం చేసుకునే సమయంలో వాగ్వాదానికి దిగి దాడులకు తెగబడుతున్నారు. హార్బర్, వన్‌టౌన్, కంచరపాలెం, గోపాలపట్నం, టూటౌన్, ఆరిలోవ పరిధిలో రౌడీషీటర్లు, ఆకతాయిలు మత్తులో రెచ్చిపోతున్నారు. రౌడీషీటర్లు, అల్లరి మూకలపై నిఘా పెట్టి, కౌన్సిలింగ్ ఇస్తున్నా మార్పు కనిపించడం లేదు.

విశాఖ కమిషనరేట్ పరిధిలో స్టేషన్లు: 22

రౌడీషీటర్లు: 350 పైగా

కార్యకలాపాలు సాగిస్తున్నది: 189 మంది

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో కేసుల నమోదు ఇలా..

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2024 (జులై వరకు) | 21650 |
| 2023 | 21376 |
| 2022 | 9667 |

**అమ్మో.. బీచ్ రోడ్డు:** బీచ్ రోడ్డులో మద్యం, గంజాయి మత్తులో కొందరు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రయితే చాలు తీరంలో గుంపులుగా కూర్చొని మద్యం తాగుతున్నారు. పలు చోట్ల విద్యుత్ దీపాల వెలుగులు సరిగా లేకపోవడంతో చీకట్లలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆ తర్వాత మత్తులో అతివేగంగా వాహనాలు నడుపుతూ బెంబేలెత్తిస్తున్నారు. బీచ్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న పోలీసులకు దొరక్కుండా వెళ్లేందుకు వేగంగా దూసుకెళుతున్నారు. పట్టుబడితే ఘర్షణలకు దిగుతున్నారు. ఇదే సమయంలో కొందరి వద్ద నగదు కూడా లాక్కెళ్లిపోతున్నారు.

# రూ.50 లక్షలతో.. అలంకరణ

మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధి 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలోని దుర్గాదేవిని సుమారు రూ.50 లక్షల కొత్త నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు ఈ అలంకరణ చేశారు. భక్తుల దర్శనార్థం బుధవారం మధ్యాహ్నం వరకు ఈ అలంకరణను ఉంచుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


–న్యూస్‌టుడే, వేపగుంట



# అత్యాధునిక కోర్సులు.. అపార అవకాశాలు..!

## వివిధ రంగాల్లో ఏఐ, ఎంఎల్ కీలకం

### ఏయూలో ప్రవేశపెట్టేందుకు సన్నద్ధం



ఈనాడు, విశాఖపట్నం: బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ)లు, ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఫార్మా.. ఇలా దాదాపుగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) కీలకంగా మారనున్నాయి. 2026 నాటికి ఆయా రంగాల్లో 80 శాతం పనులు వీటి ద్వారా జరుగుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు వీటిపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పాఠ్య ప్రణాళికలో మార్పులు చేయాలంటున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అత్యాధునిక కోర్సులు ప్రవేశపెట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**ప్రత్యేక సిలబస్ తయారీ..:** వాస్తవానికి ఒక్కో కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు సెక్షన్లకు మాత్రమే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతులు జారీ చేస్తోంది. కానీ సీఎస్‌ఈ సీట్లు పెంచుకోవడానికి వివిధ విద్యాసంస్థల్లో ఐటీ, ఏఐ, ఎంఎల్ తదితర పేర్లను చేరుస్తున్నారు. అందరికీ ఒకే సిలబస్ బోధిస్తున్నారు. ఏయూలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఏఐ, ఎంఎల్ కోర్సులకు ప్రత్యేకంగా సిలబస్ తయారు చేయనున్నారు. వాటి అమలుకు పాలకమండలి సమావేశంలో అనుమతులు తీసుకోనున్నారు. ● విద్యార్థులకు అత్యాధునిక కోర్సులు బోధించాలంటే ముందుగా బోధన సిబ్బందికి శిక్షణ అందించాలి. ప్రస్తుతం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ల కొరత ఎక్కువగా ఉంది. 250 పోస్టులకు గాను 150 వరకు ఖాళీలున్నాయి. వీలైనంత త్వరగా నియామకాలు చేపట్టాల్సిన అవసరముంది.

**బోధనకు అనాసక్తి..:** సీఎస్‌ఈ కోర్సుల్లో బోధించేందుకు బీటెక్ లేదా ఎంటెక్ కంప్యూటర్ సైన్సు చదివిన అభ్యర్థులే అర్హులు. కానీ ఆ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు బోధన కంటే ఐటీ ఉద్యోగాలకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏఐ, ఎంఎల్, పైథాన్, డేటా స్ట్రక్చర్స్ తదితర కోర్సులను ఏఐసీటీఈ ప్రవేశపెట్టింది. బీటెక్, ఎంటెక్‌లో ఏం చదివినా ఎన్‌పీటీఎల్‌లో ఈ కోర్సులు చేస్తే బోధనకు అర్హులని కేంద్ర ప్రభుత్వం గతంలో జీవో జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టనున్నారు.

**బయటి కోర్సులు నేర్చుకునేలా..:** విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరిగేలా ఏఐసీటీఈ గతంలో కొన్ని మార్పులు సూచించింది. ఇంజినీరింగ్ డిగ్రీ పొందేందుకు 160 క్రెడిట్లు అవసరం కాగా అందులో 32 క్రెడిట్లను బయటి కోర్సుల ద్వారా సంపాదించుకోవాలని తెలిపింది. వాటిని వచ్చే ఏడాదికి 64 క్రెడిట్లకు పెంచనున్నారు. ఎన్‌పీటీఎల్, స్టాన్‌ఫోర్డ్, లండన్ యూనివర్సిటీ తదితరాల్లో కోర్సులు చదివితే.. వర్సిటీలో క్రెడిట్లు కేటాయిస్తారు. ఇప్పటికే ఐఐటీ నిపుణులు తయారుచేసిన మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్) ఏయూలో అందుబాటులో ఉన్నాయి. కానీ గతంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒక్క కోర్సు (3 క్రెడిట్లు) మాత్రమే తప్పనిసరి చేశారు. ఏఐసీటీఈ సూచనల మేరకు ఆ విధానంలో మార్పులు చేయనున్నట్లు ఏయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు.

# విమానాశ్రయంలో 'ఈ-ఛార్జింగ్' స్టేషన్

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన 'ఈ-ఛార్జింగ్' స్టేషన్‌ను మంగళవారం విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి ప్రారంభించారు. విమాన ప్రయాణికుల సౌకర్యార్థం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కారుకు ఛార్జింగ్ పెడుతున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి



# రూ.29 కోట్లతో 322 పనులకు ప్రతిపాదన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనె 14 నుంచి 20 వరకు పల్లె పండగ వారోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. రూ. 29.04 కోట్లతో గ్రామీణ మండలాల పరిధిలో 322 పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. పల్లె పండగ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ... గ్రామసభల్లో గుర్తించిన పనులను నోటిపై చేశామన్నారు. ఇప్పటివరకు రూ.21.09 కోట్ల బడ్జెట్ అంచనాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. షెడ్యూలు ప్రకారం సంక్రాంతి నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఇతర జిల్లాల నుంచి రప్పిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి, డీపీఓ శ్రీనివాసరావు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశానికి హాజరైన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

# 20 నుంచి విశాఖ-రాయపూర్ రైలు వేళల మార్పు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ-రాయపూర్(08528) రైలు వేళలు ఈ నెల 20 నుంచి మార్పు చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఆరోజు నుంచి విశాఖలో ఉదయం 6.30 గంటలకు బదులు ఉదయం 4.25 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు 4.43 గంటలకు సింహాచలం, 5.05 గంటలకు కొత్తవలస, 5.50 గంటలకు విజయనగరం, 7.08 గంటలకు బొబ్బిలి, 7.40 గంటలకు పార్వతీపురం, 7.48 గంటలకు పార్వతీపురం పట్టణం, 9.15 గంటలకు రాయగడ చేరుకోనుంది.



అమ్మవారికి గులాబీ పువ్వులతో నివేదన

## విజయలక్ష్మిగా కనకమహాలక్ష్మి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాత నగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు మంగళవారం విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి గులాబీ పువ్వులతో పూజలు నిర్వహించారు. నగరానికి చెందిన కవి కొండల సత్యనారాయణమూర్తి, కళావతి దంపతులు రూ.55 వేలు చెల్లించి దాతలుగా వ్యవహరించారు. ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఈఈ సీహెచ్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా లక్ష్మీ కళ


దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం విశాఖపట్నం పోర్టు స్టేడియం సమీపంలోని శ్రీజ్ఞానప్రద లలితాదేవి సహిత వసంత వనేశ్వర ప్రసన్న గణపతి ఆలయంలో దుర్గాదేవి మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. గర్భగుడిలో, ముందు రూ.6 లక్షలు కొత్త కరెన్సీ నోట్లతో కనుల పండువగా అలంకరించారు.

– ఈనాడు, విశాఖపట్నం





తుంగ్లాంలో రూ.2.5లక్షల కరెన్సీ నోట్లతో



శాతవాహననగర్‌లో రూ.15లక్షల కరెన్సీ నోట్లతో...

న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం, కూర్మన్నపాలెం



కుండలపై నృత్యం చేస్తున్న కళాకారులు

## అమ్మవారికి నృత్య నీరాజనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ సెక్టారు-6 వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో రూపా నృత్య అకాడమీకి చెందిన కళాకారులు మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో నృత్య రూపకాలను ప్రదర్శించారు. కుండలపై నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు.



## గీతం ఆచార్యునికి ఐజీయూ పురస్కారం



కె.ఎస్.కృష్ణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భూ భౌతిక శాస్త్రవేత్తలకు ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజీయూ) ఏటా ప్రకటించే 'హరినారాయణ్ లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు-2024'కు గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ ఎంపికైనట్లు గీతం అధికారులు మంగళవారం వెల్లడించారు. మెరైన్ జియోఫిజిక్స్‌లో ఆయన జరిపిన పరిశోధనలను గుర్తించి సంబంధిత కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది డిసెంబరులో జరగనున్న ఐజీయూ వార్షిక సమావేశాల్లో ఈ అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. సముద్ర శాస్త్ర అధ్యయనాల్లో కొన్ని దశాబ్దాలుగా చేస్తున్న సేవలకు గానూ ఆయన గతంలో ఎన్నో అవార్డులు, ఫెలోషిప్‌లు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో శాస్త్రవిజ్ఞానాన్ని మరింతగా విస్తరించడానికి ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు. పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణను గీతం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు, ప్రిన్సిపల్ ఆచార్య కె.వేదవతి తదితరులు అభినందించారు.

# సాఫీగా.. సాగర ఒడిలోకి...!

న్యూస్‌టుడే, సింధియా

**షిప్‌యార్డులో నూతన వెసల్స్ సిద్ధం చేయడానికి అవసరమైన బెర్తులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించేందుకు యాజమాన్యం ముందడుగేసింది. ప్రస్తుతం ఆయా పనులు చకచకా సాగుతున్నాయి.**

★ షిప్‌యార్డులో రెండు బెర్తుల నిర్మాణం
★ రూ.400 కోట్లతో పనులకు శ్రీకారం





దేశంలో తొలి నౌకానిర్మాణ కేంద్రమైన 'హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్'లో నౌకలు నిర్మించే బెర్తులు (స్లిప్‌వేలు) శిథిలమయ్యాయి. 1940వ దశకంలో నిర్మించిన నాలుగు బెర్తులు రెండున్నర దశాబ్దాల కిందటే బీటలు వారాయి.

### 'కవర్డ్ బిల్డింగ్ డాక్'లో..

★ శిథిలమైన బెర్తుల్లో రెండింటిని తొలగించి కవర్డ్ బిల్డింగ్ డాక్‌లను నిర్మించారు. ఎండైనా, వానైనా వెసల్స్ నిర్మాణం, మరమ్మతు పనులకు ఎలాంటి ఆటంకాలు లేవు. ★ 1998 నుంచి 2002 వరకు సంస్థ ఆర్థికపరమైన చిక్కుల్లో పడడం, ఆర్డర్ల కొరత వెంటాడడం.. తదితర కారణాలతో బెర్తులపై ఎలాంటి పనులకు అవకాశం లేకుండా పోయింది. ★ 2004 తర్వాత జీఈఎంఎల్ సంస్థ ఏకకాలంలో పది నౌకల నిర్మాణ ఆర్డర్ ఇవ్వడంతో అటు కవర్డ్ బిల్డింగ్, ఇటు పాత బెర్తులపై జోరుగా పనులు సాగాయి.

### 'జల ఉష' నుంచే ప్రారంభం

★ 1941లో ఏర్పడిన సింధియా స్టీమ్ నావిగేషన్ సంస్థ (షిప్‌యార్డు పూర్వనామం) ఆధ్వర్యంలో నౌకల నిర్మాణానికి బెర్తులు నిర్మించారు. ఆ బెర్తులపైనే భారత దేశ తొలి నౌక 'జల ఉష' నిర్మించారు. ఆ తర్వాత అనేక వెసల్స్ నిర్మాణం పూర్తి చేశారు. ★ అంతర్జాతీయ వాణిజ్య విపణి విస్తరణతో నౌకల పరిమాణంలో గణనీయమైన పురోగతి సాధన వల్ల ఆధునిక బెర్తుల అవసరం ఏర్పడింది.

★ షిప్‌యార్డులో పాత బెర్తులు అనువుగా లేకపోవడంతో 2010 తర్వాత వచ్చిన రక్షణ ఉత్పత్తులను కవర్డ్ బిల్డింగ్ డాక్‌లోనే నిర్మించాల్సి వచ్చింది. ఒక వెసల్ తర్వాత, మరో వెసల్ నిర్మాణ పనులు చేపట్టడంతో తీవ్ర జాప్యం జరిగేది. ★ ఏకకాలంలో రెండు, మూడు వెసల్స్ నిర్మాణ పనులు చేపట్టే వీల్లేకపోవడంతో 'గుడ్‌ఎర్త్ మారిటైం'కు చెందిన రెండు వెసల్స్ ఆర్డర్‌ను షిప్‌యార్డు సకాలంలో పూర్తి చేయలేకపోయింది.

### పునర్ నిర్మాణం ఇలా..

కేంద్ర రక్షణ శాఖకు చెందిన అయిదు 'ఫ్లీట్ సపోర్ట్ వెసల్స్ (ఎఫ్.ఎస్.ఎస్)' నిర్మాణ ఆర్డర్ ఇటీవల హిందుస్థాన్ షిప్‌యార్డుకు దక్కింది. వాటిలో రెండింటి 'లార్సన్ అండ్ టుబ్రో' సంస్థకు షిప్‌యార్డు అప్పగించింది. ఈ వెసల్స్ నిర్మాణానికి పాత బెర్తులు అనుకూలంగా లేకపోవడంతో రూ.400 కోట్లతో పునర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.



స్లిప్‌వేల నిర్మాణ ప్రాంతం

**ఇదీ బెర్తుల లెక్క**

| | |
|---|---|
| ప్రస్తుతం నిర్మించేవి | 2 |
| పొడవు | 128 మీటర్లు |
| వెడల్పు | 40 మీటర్లు |
| రెండింటి మధ్య దూరం | 10 మీటర్లు |
| కొత్తగా ఏర్పాటు చేసే గొలియాత్ క్రేన్ సామర్థ్యం | 300 టన్నులు |



# మద్యం దుకాణాలకు ఊపందుకున్న దరఖాస్తులు


మాధవధార, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. నిన్నటి వరకు నగరంలో దాదాపుగా 40 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కానీ మంగళవారానికల్లా అన్ని దుకాణాలకు దరఖాస్తులు నమోదు చేశారు. కొన్ని చోట్ల కొందరు నేతలు సిండికేట్ చేయాలన్న ఒత్తిళ్ల నేపథ్యంలో ముందుగా ఒప్పందానికి వచ్చిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని దుకాణాలకు తాము చెప్పిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలన్న హెచ్చరికలూ జారీ అయ్యాయి. దీంతో చాలా చోట్ల ఈ విధానాన్ని కొంత మంది వ్యాపారులు వ్యతిరేకించారు. ఈ పరిణామాల మేరకు మద్యం దుకాణాల లైసెన్సుల దరఖాస్తుల విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని ప్రభుత్వం సూచించడంతో, సోమవారం నుంచి చాలా మంది వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. గడువు తేదీ నాటికి ఇంకా రెట్టింపు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. ఒక్కో దుకాణానికీ కనీసం 5 నుంచి 10 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**రాజకీయ నేపథ్యం ఉన్న వారే:** నూతన మద్యం విధానంలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో ఎక్కువగా రాజకీయ నేపథ్యం ఉన్న వారే పెత్తనం చెలాయిస్తున్నారు. చాలా చోట్ల ప్రజా ప్రతినిధులు, నేతల చూపు మద్యం దుకాణాలపై పడింది. విశాఖ నగరంలో కూటమికి సంబంధించిన కొంత మంది నాయకులు రంగంలోకి దిగారు. పాత సిండికేట్లు దృష్టి సారించాయి. ఇతరులను రాకుండా తామే వ్యాపారం చేద్దామంటూ వ్యాపారులు కూడబలుక్కుంటున్నారు. ముందుగా దరఖాస్తు చేద్దాం, లాటరీలో దుకాణం దక్కితే కలిసి చేసుకుందామని నిర్ణయించుకుంటున్నారు. దుకాణం ఏర్పాటుకు, అమ్మకాలకు ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో పాత సిండికేట్లు వారి అనుభవం ఉన్న వ్యాపారులతో ముందుకు వెళ్తున్నారు. నగరంలో ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్లలోని దుకాణాల్లో అమ్మకాలు నిత్యం రూ.లక్షల్లో ఉండటంతో వాటిపైనే అధిక శాతం మంది దృష్టి సారిస్తున్నారు. ఆయా చోట్ల వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి ఒక్కో దుకాణానికి 10 మంది 15 చొప్పున దరఖాస్తులు వేశారు.

### 331 దుకాణాలకు 2903 దరఖాస్తులు

శుక్రవారం చివరి రోజు కావడంతో మద్యం దుకాణాలకు అప్పటికి భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. మంగళవారం వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో వచ్చిన దరఖాస్తులిలా..

| జిల్లా | షాపులు | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| విశాఖ | 155 | 1122 |
| అనకాపల్లి | 136 | 1294 |
| అల్లూరి | 40 | 487 |
| మొత్తం | 331 | 2903 |



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని, వారు ఇష్టపడి తినేలా తయారు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు, నిర్వహణ తీరుపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలని, వంటకాల రుచి, ఆహార నాణ్యత విషయంలో పిల్లల అభిప్రాయాలు, తీసుకొని ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని 581 పాఠశాలల్లో ఈ పథకం అమలవుతోందని, వాటిలో 315 పాఠశాలలకు అక్షయపాత్ర, 266 విద్యాలయాలకు ఏజెన్సీ ద్వారా ఆహారం అందిస్తున్నామన్నారు. సమావేశంలో డీఈఓ చంద్రకళ, జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీఈఓ చంద్రకళ తదితరులు

## స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు పదిలం: ఎంపీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమరస్వామిని కలిసి విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తుపై చర్చించామని, ఇందుకు కేంద్రం నుంచి పూర్తి మద్దతు లభించిందని విశాఖ ఎం.పి. శ్రీభరత్ తెలిపారు. అన్ని రకాలుగా స్టీల్‌ప్లాంటు భవిష్యత్తును రక్షించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటును డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని, విశాఖ- అమరావతి మధ్య కొత్త రైల్వే లైన్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచటం, ఉక్కు పరిశ్రమలో ఉద్యోగ భద్రతను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.



## బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి ఔదార్యం




పల్లాకు డీడీలు అందిస్తున్న దాతలు శివరామకృష్ణయ్య, శ్యామలాదేవి

అక్కిరెడ్డిపాలెం (ఆటోనగర్), న్యూస్‌టుడే : అమరావతి నిర్మాణానికి, విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించిన బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి తన ఔదార్యం చాటుకున్నారు. ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న గోగినేని శివరామకృష్ణయ్య, శ్యామలాదేవి దంపతులు మంగళవారం వారి నివాసంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు రూ.2లక్షల విలువైన డీడీలు అందించారు. పారిశ్రామికవేత్త అట్లూరి రమేష్, నాయకులు ఎం.శ్రీను పాల్గొన్నారు.

## మాతృ మరణాలు జరగకుండా చర్యలు చేపట్టండి

వన్‌టౌన్: జిల్లాలో మాతృ మరణాలు నమోదు కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాతృ మరణాల నిరోధక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబరు వరకు రైల్వేన్యూకాలనీ, స్వతంత్రనగర్, బుచ్చిరాజుపాలెం, దుర్గాబజార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో నాలుగు మాతృ మరణాలు సంభవించాయన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు, వైద్యాధికారులు బి.ఉమాపతి, కేవీఎస్ఎం సంధ్యాదేవి, శ్రవణ్, గణేశ్, ఎస్‌సీబీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం



రాంబాబు (పాతచిత్రం)

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెశెట్టి రాంబాబు (28) అనే వ్యక్తి దుర్మరణం చెందారు. చిప్పాడ దివీస్ లేబొరేటరీస్‌లో సూపర్‌వైజరుగా చేస్తున్న ఈయన విధులు ముగించుకుని ఉదయం ఏడు గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సిటీనగర్ గ్రామం వద్ద ముందున్న ట్రాక్టరును తప్పించుకుని వెళ్లే క్రమంలో ఎదురుగా లారీ రావడంతో అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. దాంతో ట్రాక్టరుకు తగిలి కింద పడ్డారు. హెల్మెట్ ఉన్నప్పటికీ తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈయన తగరపువలస బాలాజీనగర్‌లో భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఈయన స్వగ్రామం కాకినాడ జిల్లా దుర్గాడ గ్రామం. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమిలి సీఐ సుధాకర్, ఎస్ఐ హరీశ్ పేర్కొన్నారు.

## వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

గాజువాక, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం గాజువాక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాల యాజమాన్యం రూ.2 లక్షల విరాళం ప్రకటించింది. మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి పేరిట తీసిన చెక్కును కళాశాల కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు అందజేశారు. కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దౌర్జన్యానికి పాల్పడిన గంజాయి ముఠా అరెస్టు



పట్టుకున్న నిందితుల్లో ఇద్దరు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస శ్మశాన వాటిక వద్ద దారి కాచి పలువురిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న గంజాయి ముఠాను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ సుధాకర్ తెలిపారు. భీమిలి, తగరపువలస, భోగాపురం పరిసర ప్రాంతాలకు చెందిన సురేష్, వెంకటేశ్, లోకేశ్, నూకరాజు, చిట్టిబాబు ఈనెల ఆరో తేదీ రాత్రి స్థానికులతో దౌర్జన్యంగా ప్రవర్తించారు. ఈ క్రమంలో గణేశ్ అనే యువకుడు గాయపడ్డాడు. ఆగ్రహించిన స్థానికులు ఆ బృందంలోని ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేసి అదే రోజు రాత్రి పోలీసులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వారిలో సురేశ్, లోకేశ్‌లపై భీమిలి, త్రీటౌన్ స్టేషన్ల పరిధిలో రౌడీషీట్లు ఉన్నట్లు చెప్పారు.

## పెరిగిన విమానాశ్రయం వృద్ధి రేటు

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో విమాన సర్వీసుల రాకపోకల్లో విశాఖపట్నం విమానాశ్రయం వృద్ధి రేటు పెరిగిందని రాష్ట్ర ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.కుమార్‌రాజా, ఓ.నరేశ్‌కుమార్, డీఎస్.వర్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 5,398 విమాన సర్వీసుల్లో 7,02,787 మంది ప్రయాణించారన్నారు. మొదటి త్రైమాసికంతో పోల్చితే విమాన రాకపోకల్లో 6.8%, ప్రయాణికుల సంఖ్యలో 1.2% వృద్ధి రేటు నమోదైందన్నారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 115 | 110 |
| లైవ్ | 137 | 130 |
| డ్రెస్‌డ్ | 199 | 230 |
| స్కిన్‌లెస్ | 226 | 240 |

# పెందుర్తి

**తెరపై ఈనాడు**
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

## మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెంలోని మత్స్యకారులకు సింహాద్రి ఎన్టీపీసీలో ఉపాధి కల్పించాలని సర్పంచి చింతకాయల సుజాత, మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు కోరారు. ఈ మేరకు సంస్థ అడ్మిన్ భవనంలో జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ వ్యర్థ జలాలు, ఫ్లైయాష్ తీరంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి వేటసాగక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో 60 మందికి ఉపాధి కల్పిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని ఇప్పటికీ ఆ ఉద్యోగాలు ఇవ్వలేదని వినతిలో పేర్కొన్నారు.

## వారు చేయరు.. వీరిని చేయనివ్వరు..

**జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయలోపం**

**వేపగుంట - పినగాడి రహదారికి వీడని గ్రహణం**


అతుకుల బొంతలా వేపగుంట - పినగాడి రహదారి


దారంతా ఇదే దుస్థితి

వేపగుంట, న్యూస్‌టుడే

తాను పెట్టదు.. ఇంకొకరి పెట్టనివ్వదు అన్న చందంగా మారింది జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారుల తీరు. ఈ రెండు శాఖల సమన్వయలోపం కారణంగా ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. జీవీఎంసీ జోన్-8 పరిధిలోని అత్యంత రద్దీ కలిగిన రహదారిలో వేపగుంట - పినగాడి రోడ్డు ఒకటి. గత వైకాపా ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనా పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదట ఈ రహదారినే నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పంచకర్ల రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలుపొంది 100 రోజుల పాలన పూర్తి చేసుకున్నారు. అయినప్పటికీ రోడ్డును మాత్రం బాగు చేయలేకపోయారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటే పనులు జరుగుతాయని ప్రజలు చెబుతున్నారు.

### ఎన్నికలకు ముందు హడావిడిగా..

వేపగుంట - పినగాడి రహదారి ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. గుంతలతో అధ్వానంగా తయారవ్వడంతో రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అప్పటి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. కొద్దిరోజులు తూతూమంత్రంగా పనులు జరిగాయి. గుత్తేదారుకి బిల్లులు చెల్లింపులో ఆలస్యం కావడంతో ఆయన చేతులెత్తేసి వెళ్లిపోయినట్లు సమాచారం. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకపోవడంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కాస్త చొరవ చూపారు. ఆర్‌అండ్‌బీ పనులు చేయకపోతే కనీసం జీవీఎంసీ పరిధిలో ఉన్న రహదారినైనా నిర్మించాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. పనులు ప్రారంభించే సమయానికి ఆర్‌అండ్‌బీ అధికారులు అడ్డు చెప్పారు. మా పరిధిలో ఉన్న రహదారిని జీవీఎంసీ నిధులతో ఎలా చేయిస్తారని కొర్రీ వేశారు. కొద్దిరోజుల్లో తామే ప్రారంభిస్తామని ఎమ్మెల్యేకు ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు. అలాచెప్పి నేటికి రెండునెలలు అవుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

### 8 నెలల్లో నలుగురు మృతి..

★ ఈ ఏడాది జనవరిలో సబ్బవరం మండలం గుల్లేపల్లికి చెందిన ఓ వివాహిత తన భర్తతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ చీమలాపల్లి వద్ద ఓ గొయ్యిని తప్పించబోయి కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

★ ఏప్రిల్ 16న కృష్ణానగర్‌కు చెందిన సూరిశెట్టి లక్ష్మి అనే వృద్ధురాలు తన భర్తతో ద్విచక్రవాహనంపై వస్తూ గుంతలో పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

★ మే 20 బి.అమృత్ భరద్వాజ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ గుంతలను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయి మృతి చెందాడు.

★ ఆగస్టు 12న ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తూ చీమలాపల్లి వద్ద గుంతలను తప్పిస్తుండా ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో మొల్లేటి భీమాచారి మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎనిమిది నెలల గడువులో నలుగురు ప్రాణాలు కోల్పోయినా పాలకులు, అధికారులకు పట్టించుకోకపోవడంపై పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


చీమలాపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా గోతులు

**వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా..**

జీవీఎంసీ నిధులతో సగ భాగం రహదారిని అభివృద్ధి చేయించేలా గత జీవీఎంసీ కమిషనర్‌ను ఒప్పించా. కానీ నిబంధనల ప్రకారమే పనులు జరగాల్సి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడంతో నిలిచిపోయాయి. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పిన ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్సారం చేస్తున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటా.

– పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే, పెందుర్తి

## చోరీల నియంత్రణపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద విధిగా సి.సి.కెమెరాలను అమర్చాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మంగళవారం పోలీసు సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, ఎ.టి.ఎం. సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎ.టి.ఎం.ను చోరీ చేసిన తీరును వివరించి, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. నగరవ్యాప్తంగా ఉన్న 654 ఎ.టి.ఎం.ల్లో భద్రతా సమస్యలను తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే మొదటి గంట సమయంలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశముందన్నారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం అవసరమన్నారు. డి.సి.పి. అజిత వేజెండ్ల, డి.సి.పి(క్రైమ్) లతా మాధురి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన


ఇంటర్న్‌షిప్‌ను పర్యవేక్షిస్తున్న జీసీడీవో పద్మావతి

సబ్బవరం, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగుల విధులు, బాధ్యతలు, అక్కడ అందిస్తున్న సేవలపై సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా అసకపల్లి సచివాలయానికి తీసుకెళ్లి ఉద్యోగుల పనితీరును ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి(జీసీడీవో) పద్మావతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతిలోగా ఉపాధి పనులు పూర్తి చేయాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న 'పల్లె పండగ.. గ్రామ పంచాయతీ వారోత్సవాలు' పురస్కరించుకుని మంగళవారం ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ వీసీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీవోలు పాల్గొన్నారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేసిన పనులకు ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయా పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ఈ నెల 14 నుంచి 21 వరకు జరిగే వారోత్సవాల్లో కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఆయా పనులను వచ్చే ఏడాది సంక్రాంతిలోగా పూర్తి చేసి నిధులను సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పెందుర్తి ఇంఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, మూడు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీవోలు

## ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక కలయిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సబ్బవరం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన జిలానీ బేగం మంగళవారం సుజాతనగర్‌లోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ఏమైనాసమస్యలుంటే ఉండొద్దని, మంచి పేరు తెచ్చుకోవాలని జిలానీ బేగంకు ఎమ్మెల్యే పంచకర్ల సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అన్నంరెడ్డి శంకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిలానీ బేగం

## నిర్వాసిత గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

పరవాడ, న్యూస్‌టుడే: ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సంస్థ అడ్మిన్ భవనంలో మంగళవారం నిర్వాసిత గ్రామాల సర్పంచులు, మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్టీపీసీ సీఎస్‌ఆర్‌లో భాగంగా విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏయే అవసరాలు ఉన్నాయి, ఎలాంటి పనులు చేయాలి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంస్థ అధికారులు ప్రశాంతకుమార్ జెనా, పద్మప్రియ, శ్రీమంత మహాపాత్ర, బి.బి.పాత్ర, ప్రకాశరావు, శివప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


సర్పంచులు, అధికారులతో జీజీఎం సంజయ్‌కుమార్‌సిన్హా

## సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా అధునాతన పద్ధతులు అవలంబించడంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధించాలని పరవాడ మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి పేర్కొన్నారు. తానాంలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి కన్నూరు దేవి, ఏవో చంద్రావతి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. వరి పంటకు పొటాష్ లోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అశ్విని, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తానాంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో చంద్రావతి, సర్పంచి దేవి తదితరులు

## వెలుగు ఏపీఎంగా రంగారావు


రంగారావు


ఫిరోజ్ బేగం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెలుగు ఏపీఎంగా బి.రంగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమిలి ఏపీఎంగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో సబ్బవరం, ముంచింగిపుట్టు, డుంబ్రిగుడలో పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన కనకమ్మ చీడికాడ మండలానికి బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ఫిరోజ్ బేగం బాధ్యతలు చేపట్టారు. ఈమె విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో అరకులో పనిచేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని జాజులవానిపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్యుతాపురం మండలం తిమ్మయ్యపేటకు చెందిన ముమ్మ చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై గాజువాక వెళ్తుండగా అదే దారిలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

## పశువులు ఉచిత వైద్య శిబిరం

ముదపాక(పెందుర్తి), న్యూస్‌టుడే: పశు సంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ పరిధిలోని బొడ్డువానిపాలెంలో పశువుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. పెందుర్తి మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహనరావు, పశు గణాభివృద్ధి సంఘం వైద్యురాలు డాక్టర్ సౌజన్య పాల్గొని 56 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.


పాడి రైతులకు మందులు అందజేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎం.చంద్రశేఖర్

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అసకపల్లి శివారు గణపతినగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి మామిడి చందు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈయన తండ్రి కనకరాజు ఆటోడ్రైవర్, తల్లి త్రిమూర్తులు గృహిణి. జాతీయ పోటీల్లో రాణించాలని గ్రామస్థులు చందును మంగళవారం అభినందించారు.

## విశాఖ జట్టు ఘన విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా కడప వైఎస్‌ఆర్‌-ఏసీఏ క్రికెట్ మైదానంలో తూర్పుగోదావరితో జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 112/2తో బ్యాటింగ్ కొనసాగించిన విశాఖ జట్టు 68 ఓవర్లలో 426/3 పరుగులకు డిక్లేర్ చేసింది. విరాట్ (177*), రామ్‌చరణ్(133) సెంచరీలతో చెలరేగి జట్టుకు భారీ స్కోరును అందించారు. అనంతరం 167 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూ.గో. జట్టు 34 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం చవిచూసింది. ప్రజ్వల్‌వర్మ 5, వినోద్ 2 వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు.

## న్యాయం చేయాలని భూసేకరణ రైతుల నిరసన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ జగనన్న లేఅవుట్‌కు చెందిన భూసేకరణ రైతులు నిరసన చేపట్టారు. రైతులు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. లేఅవుట్‌లో తమకు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమ వద్దనున్న డి.పట్టా భూములను తీసుకుని పరిహారంలో ఎకరానికి లేఅవుట్‌లో అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పూర్తిస్థాయిలో స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంబేడ్కర్ వెంటనే చేరుకుని రైతులతో మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్


సుజాతనగర్‌లో మహాలక్ష్మి అలంకరణ


శ్రమశక్తినగర్‌లో మంగళగౌరిగా..


ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


మహాలక్ష్మిగా సరిపల్లి దుర్గాంబ


శారదాపీఠంలో..


రాజరాజేశ్వరిగా నాయుడు తోట గాయత్రిదేవి


బాలాజీనగర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారు


దుర్గానగర్‌లో లక్ష్మీదేవి అలంకరణ


కృష్ణానగర్‌లో..


మణిపురం భువనేశ్వరీమాత

## క్షీరసాగర తనయకు.. భక్తజన నీరాజనం


సబ్బవరం దుర్గాదేవి ఆలయంలో భరతనాట్యం చేసిన సింహనాథ్ బృందం

లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం.. శ్రీరంగ ధామేశ్వరీ.. అంటూ భక్తజనం మహాలక్ష్మి అమ్మవారిని మనసారా స్మరించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్మాత శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమాలు జరిపారు. - న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


పిట్టవానిపాలెంలో..


పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో..


సర్దార్ గౌతులచ్చన్న నగర్ కూడలిలో..


వెన్నెలపాలెంలో..


బొద్దపువానిపాలెంలో..


పెదనాయుడుపాలెంలో సారె సమర్పణ

## ఘనంగా స్వాగత వేడుకలు

వేపగుంట, న్యూస్‌టుడే: ఆర్‌ఆర్‌వెంకటాపురం దరి ఎస్‌వీఎల్‌ఎన్(ఆళ్వార్‌దాస్) కళాశాలలో మంగళవారం నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు హాజరై కళాశాల ప్రాంగణంలో గల ఆళ్వార్‌దాస్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు ఉల్లాసంగా గడుపుతూ నృత్య ప్రదర్శనలు చేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ ఆళ్వార్‌దాస్, సమన్వయకర్త జీవీఏఎస్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

## రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

సబ్బవరం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని గ్రామాల్లో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తెలిపారు. వార్డు పరిధిలోని నంగినారపాడు, గంగవరం, వెదుళ్లనరవ, దువ్వాడ ప్రాంతాల్లోని ధ్వంసమైన రోడ్లు, కాలువల పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వెదుళ్లనరవ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న కాలువను మంగళవారం పరిశీలించారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని గుత్తేదారుకు సూచించారు.


కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు

## జీవీఎంసీలో లీకుల పరంపర

జీవీఎంసీ జోన్-8 పరిధిలో తాగునీటి పైపులైన్ల లీకుల పరంపర కొనసాగుతూనే ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నా వృథాను మాత్రం అరికట్టలేకపోతున్నారు. దీంతో తాగునీరు యథేచ్ఛగా వృథా అవుతోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దొగ్గవానిపాలెంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో గత వారం రోజులుగా మంచినీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజు కుళాయిలు వచ్చే సమయంలో పైపులైను లీకేజీ వల్ల నీరంతా రోడ్డు పాలవుతోందని పేర్కొన్నారు. దీంతో శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరందడం లేదని చిన్నధారలా వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరారు.– న్యూస్‌టుడే, పెందుర్తి

**దర్పణం**



## నీటికి బదులు నాచు

పరవాడ, న్యూస్‌టుడే: ప్రస్తుత వర్షాకాలంలో నీటితో కళకళలాడాల్సిన చెరువులు పిచ్చిమొక్కలు, నాచుతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరవాడ శ్మశానవాటికను ఆనుకుని ఉన్న చెరువు వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. తూటికాడ, చెత్త, గుర్రపుడెక్కతో మురుగు కుంటను తలపిస్తోంది. కాలుష్య కాసారంగా మారి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ, పథకం, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో తటాకాలకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెరువు, పరిసరాలను శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నాచు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న చెరువు

## నిరంతర వెలుగులు.. పట్టని అధికారులు

సబ్బవరం, న్యూస్‌టుడే: రెండు నెలలుగా నిరంతరాయంగా విద్యుత్తు దీపాలు వెలుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు, అజనగిరి గ్రామాల్లో పగలు, రాత్రీ అనే తేడా లేకుండా చాలా దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. రెండు పల్లెల్లో కలిపి సుమారు నాలుగు వందలకు పైగా దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల దీపాల కాలపరిమితి కంటే ముందే మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని చెబుతున్న అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగటిపూట వెలుగులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.


రామాలయం ఎదుట పగలు వెలుగుతున్న హైమాస్ట్ దీపాలు


ఓ వీధిలో నిరంతరం వెలుగులు

# ఈనాడు సినిమా

## రామ్‌చరణ్ - ప్రశాంత్ నీల్ కలయికలో!


రామ్‌చరణ్

రామ్‌చరణ్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు పచ్చజెండా ఊపారు. ఇప్పుడీ జాబితాలో కొత్తగా మరో ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' విజయాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడాయనతో చరణ్ ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఇప్పటికే దీనిపై చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌ను డీవీవీ దానయ్య నిర్మించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రశాంత్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. దీని తర్వాత 'సలార్ 2', 'కేజీఎఫ్ 3' పూర్తి చేయాల్సి ఉంది. వాటి తర్వాతే రామ్‌చరణ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశముంది. ఈలోపు బుచ్చిబాబు, సుకుమార్‌ల సినిమాలు పూర్తి చేయనున్నారు చరణ్.

## ఆ రోజు విడుదల పక్కా


అల్లు అర్జున్

బాక్సాఫీస్ తుపాన్‌ని వీక్షించడానికి సిద్ధంగా ఉండాలంటూ ప్రేక్షకులకు పిలుపునిచ్చింది 'పుష్ప 2' బృందం. 'పుష్ప2' మొదటి సగ భాగం ఎడిటింగ్ పూర్తి చేసుకుని లోడ్ అయిపోయిందని, అంచనాల్ని మించి సినిమా ఉంటుందని చిత్రబృందం స్పష్టం చేసింది. చిత్రం డిసెంబరు 6న విడుదల పక్కా అని పునరుద్ఘాటిస్తూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాల్ని పేర్కొంది. 'పుష్ప' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రం 'పుష్ప2'. అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా మరోవైపు నిర్మాణానంతర పనుల్ని పూర్తి చేసుకుంటోంది.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం స్వీకరిస్తున్న మిథున్ చక్రవర్తి


రిషబ్‌శెట్టి


నిత్యామేనన్


మానసీ పరేఖ్

## సమాజాన్ని మార్చడంలో సినిమాలదీ కీలక పాత్రే!


అభిషేక్ అగర్వాల్


చందూ మొండేటి

- జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించిన మిథున్ చక్రవర్తి

"భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా సినిమాల్ని రూపొందిస్తోంది భారతీయ సినీరంగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద చిత్రపరిశ్రమ మాత్రమే కాదు.. కళారంగంలోనే ఎంతో వైవిధ్యమైనది" అన్నారు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు పురస్కారాలు అందించారు ముర్ము. ఇందులో భాగంగా భారతీయ చలన చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుతో నటుడు మిథున్ చక్రవర్తిని సత్కరించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ రోజు దాదాపు 85మంది పురస్కారాల్ని అందుకున్నారు. అందులో మహిళలు కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. చిత్రపరిశ్రమలో మహిళల్ని ప్రోత్సహించేలా భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు తీయడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను. సమాజాన్ని మార్చడంలో సోషల్ మీడియాతో పాటు సినిమా కూడా కీలకమైన పాత్ర పోషిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్‌తో పాటు అవార్డుల జ్యూరీ బృందం పాల్గొంది.

● ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో 'కాంతార' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన కన్నడ కథానాయకుడు రిషబ్‌శెట్టి ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా నిత్యామేనన్ (తిరుచిత్రాంబలం), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డుల్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ చిత్రంగా 'ఆట్టమ్' (మలయాళం), ఉత్తమ దర్శకుడిగా సూరజ్ బర్జాత్యా (ఊంచాయి) పురస్కారాల్ని గెలుచుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2'కు గానూ దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ పురస్కారాల్ని అందుకున్నారు.

### డబ్బులేదని ఆశయాలు వదలొద్దు

దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించిన మిథున్ చక్రవర్తి స్పందిస్తూ.. "ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. నా జీవితంలో ఏదీ అంత సులువుగా రాలేదు. ఎంతో కష్టపడ్డాను. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం మీ ఆశీస్సులే అని నమ్ముతాను. మనదేశంలో ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. నేను వారికి చెప్పాలనుకునేది ఒక్కటే. మీ దగ్గర లేనిది డబ్బు మాత్రమే.. అందుకోసం మీ ఆశయాలను ఎప్పుడూ వదులుకోకండి. కలలు కనండి వాటిని నెరవేర్చుకోవడం కోసం శ్రమించండి" అని చెప్పారు.

## ఓ అందమైన ప్రయాణం... విశ్వం


టి.జి.విశ్వప్రసాద్, గోపీచంద్, శ్రీను వైట్ల, కావ్య థాపర్, వేణు దోనేపూడి

"నేను చాలా సినిమాలు చేశా. 'విశ్వం' ప్రయాణం ఎంతో సౌకర్యంగా అనిపించింది. అందుకు కారణం దర్శకుడు శ్రీను వైట్ల. ఆయన కథ చెబుతున్నప్పుడు, సెట్‌లో నటిస్తున్నప్పుడు బాగా నవ్వుకునేవాళ్లం. ఈ కథలో అంత అద్భుతంగా కామెడీ పండింది. యాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుంద"ని చెప్పారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'విశ్వం'. కావ్య థాపర్ కథానాయిక. శ్రీనువైట్ల దర్శకుడు. వేణు దోనేపూడి, టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. దసరా సందర్భంగా ఈ నెల 11న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ "విశ్వం' శ్రీనువైట్ల మార్క్ సినిమా. ఈ సినిమాతో శ్రీనువైట్ల తన పూర్వ వైభవాన్ని చాటుతార"న్నారు. శ్రీనువైట్ల మాట్లాడుతూ "ఈ సినిమా ఓ అందమైన ప్రయాణం. ఈ చిత్రం అందరికీ వినోదాన్ని పంచుతుందని వందశాతం నమ్మకంతో చెబుతున్నా" అన్నారు. కార్యక్రమంలో కావ్య థాపర్, టి.జి.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, శ్రీరామ్ ఆదిత్య, మహేశ్, అనీషా ఆంబ్రోస్, చేతన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమంత, అలియా భట్

## తెలుగు ప్రేక్షకుల్ని మించినోళ్లు లేరు: అలియా

"కొన్ని సినిమాల ట్రైలర్లు, ప్రచార చిత్రాలు చూస్తుంటే అవి మనల్ని 'రా.. చూడు' అని పిలుస్తున్నట్లు ఉంటుంది. ఈ 'జిగ్రా' ట్రైలర్ చూశాక నాకదే అనుభూతి కలిగింది" అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా తెరకెక్కించిన చిత్రమే 'జిగ్రా'. ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, ఎటర్నల్ షైన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించాయి. ఈ సినిమాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా దగ్గుబాటి ఈ నెల 11న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. దర్శకుడు త్రివిక్రమ్, నటి సమంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలియా భట్ మాట్లాడుతూ.. "ఆర్‌ఆర్‌ఆర్' ద్వారా నాకు తెలుగు భాషతో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. మంచి సినిమాల్ని ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల్ని మించిన వారు లేరు. కచ్చితంగా 'జిగ్రా' అందరికీ నచ్చుతుంది" అంది. ఈ కార్యక్రమంలో రానా, వాసన్ బాలా, వేదాంగ్, రాహుల్ రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


ఆఖరి దశలో ఓదెల 2

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో



# రోడ్లపై రేసింగ్‌లా.. నిఘా ఉంది జాగ్రత్త

**వారాంతపు సెలవులు వస్తే చాలు యువత బృందాలుగా ఏర్పడి బైక్ రేసింగ్‌లతో రెచ్చిపోతున్నారు. పోటీల పేరిట మితిమీరిన వేగంతో రోడ్లపై నానా హంగామా సృష్టిస్తున్నారు. వాహన ముందు చక్రాలను గాల్లో ఎగరేస్తూ విన్యాసాలు చేస్తున్నారు. సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలతో దూసుకెళ్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు. వేగంగా వెళ్తున్న కారుకు హఠాత్తుగా బ్రేకులు వేసి అక్కడికక్కడే గుండ్రంగా మలుపులు తిప్పుతున్నారు. యువత ఇష్టారీతిన రోడ్లపై చేస్తున్న చేష్టలతో పలువురు వాహన చోదకులు, పాదచారులు సైతం భయాందోళనకు లోనవుతున్నారు.**

మధురవాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే

- ✦ బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్ ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక గస్తీ
- ✦ వారం రోజుల్లో 11 మంది యువకుల పట్టివేత

నగర పరిధిలోని రుషికొండ బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్, తారకరామ లేఅవుట్, పనోరమహిల్స్, మధురవాడ ప్రాంతాలు బైక్ రేసింగ్‌లకు అడ్డాగా మారాయి. రాత్రి, పగలు తేడా లేకుండా యువత మద్యం తాగి రూ.లక్షల ఖరీదు చేసే వాహనాలతో ఇష్టానుసారం రోడ్లపై విన్యాసాలు చేస్తున్నారు. ద్విచక్రవాహనం ముందు చక్రం గాల్లో ఉండగా వెనుక చక్రంతో ఎక్కువ దూరం వెళ్లడం, వేగంగా వెళ్తూ రోడ్డుపై నిప్పురవ్వలు వచ్చేలా చేయడం, రెండు నిమిషాల్లో కిలోమీటరు దూరం చేరుకోవడం, మలుపులో రోడ్డుకు అంటుకునేలా బైక్‌ను ఓ వైపునకు వాల్చి నడపడం తదితర పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. వీరితో పలువురు యువతులు సైతం వచ్చి వారిని చప్పట్లతో ప్రోత్సహిస్తున్నారు. దీంతో యువకులు మరింతగా రెచ్చిపోయి ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే అంతా కలిసి వారిపై తిరుగుబాటు ప్రదర్శిస్తున్నారు. ఈ పోటీల పేరుతో పలువురు యువకులు గాయాల పాలైన సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

■ **సీపీ ఆదేశాలతో పోలీసుల నిఘా..** ఆయా ప్రాంతాల్లో నిరంతరాయంగా సాగుతున్న బైక్ రేసింగ్‌లపై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఇటీవల పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఆదేశాల మేరకు సంబంధిత ప్రదేశాల్లో పోలీసుల నిఘా చర్యలు ముమ్మరం చేశారు. పగలు, రాత్రి పోలీసు సిబ్బంది గస్తీ చేపడుతున్నారు. వాహనాలతో వస్తున్న యువతపై అనుమానం వస్తే వెంటనే చర్యలు చేపడుతున్నారు.

■ లైసెన్స్‌ల రద్దుకు సిఫార్సు బైక్ రేసింగ్‌లలో యువత ఎవరైనా పట్టుబడితే మొదటిసారి మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు, రెండోసారి దొరికితే లైసెన్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని రవాణాశాఖ అధికారులకు పోలీసులు సిఫార్సు చేస్తున్నారు. పిల్లలకు ఖరీదైన వాహనాలు అందించి ఈ తరహా చర్యలకు పరోక్షంగా సహకరిస్తున్న తల్లిదండ్రులను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ పేరుతో సుతిమెత్తగా హెచ్చరిస్తున్నారు. ఆయా వాహనాలను సైతం సీజ్ చేస్తున్నారు.


మధురవాడలో రేసింగ్ యువకుల నుంచి స్వాధీనపర్చుకున్న ద్విచక్ర వాహనాలు

### ఇటీవల రెండు బృందాలను పట్టుకున్నాం



మధురవాడ పనోరమహిల్స్ నుంచి రుషికొండ వెళ్లే రోడ్డులో వారం రోజుల్లో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న యువతను పట్టుకున్నాం. ఒక బృందంలో 6గురు, మరో బృందంలో 5గురు పట్టుబడ్డారు. వీరంతా రూ.లక్షలు ఖరీదు చేసే ద్విచక్ర వాహనాలతో రోడ్లపై విన్యాసాలు చేస్తున్నారు. సంబంధిత యువకుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. వీరి ఆగడాలను నియంత్రించేందుకు సీపీ ఆదేశాల మేరకు ఐటీహిల్స్, బీచ్‌రోడ్డు, పనోరమ హిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగం పోలీసుల ఆధ్వర్యంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాం.

–ఎస్.కాంతారావు (నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ)


గుహల అందాలు తిలకిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్‌తిల్హారి

## బొర్రాగుహల అందాలు అద్భుతం

అనంతగిరి గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: బొర్రాగుహల సహజసిద్ధ అందాలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జె. రవినాథ్ తిల్హారి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని పర్యటక ప్రాంతాలను మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అనంతగిరి మండలంలో ముందుగా కాఫీతోటలను పరిశీలించారు. అక్కడ నుంచి నేరుగా కుటుంబ సభ్యులతో కలిసి బొర్రాగుహలు సందర్శించారు. అనంతరం అనంతగిరి హరితా హిల్‌రిసార్ట్స్‌కు పయనమయ్యారు. చాపరాయి జలవిహారిలో ఆయనకు గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో గిరి మహిళలు స్వాగతం పలికారు.

## త్వరితగతిన ఆర్వోబీ నిర్మాణ పనులు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ఎన్ఏడీకూడలి సమీప ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జ్) పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి నిర్మాణ పనుల్ని పరిశీలించారు. రైల్వేశాఖతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలన్నారు. కాకానినగర్ వద్ద సబ్‌వే నిర్మాణ ప్రాంతాన్ని ఖరారు చేయాలన్నారు. భారీ వాహనాలన్నీ పైవంతెన మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన ఎన్ఏడీకూడలి పైవంతెన మధ్యలో అధ్వానంగా ఉన్న వాటర్ ఫౌంటెయిన్‌ను, స్థానిక గాంధీనగర్ రోడ్డును పరిశీలించారు. వంతెన మధ్యలోని ఉద్యానవనం, వాటర్ ఫౌంటెయిన్ నిర్వహణతో పాటు, పచ్చదనం పెంపునకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇంజినీర్లు భవానీశంకర్, బలరామరాజు, విశ్వనాథ్, ఉపమేయర్ జియ్యాని శ్రీధర్, గుత్తేదారులు పాల్గొన్నారు.


వాటర్ ఫౌంటెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్

## శాంతి ఆశ్రమం భూముల్లో పెట్రోల్ బంక్ భవనం కూల్చివేత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: శాంతి ఆశ్రమం భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న పెట్రోలు బంకు భవనం కూల్చివేతలను మంగళవారం ఉదయం జీవీఎంసీ అధికారులు చేపట్టారు. బీచ్‌రోడ్డు లాసన్స్‌బేకాలనీ శాంతి ఆశ్రమానికి సంబంధించిన భూముల్లో ఆక్రమణదారులను తక్షణం ఖాళీ చేయించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా కాంక్రీట్ స్లాబ్ వేశారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పొక్లెయిన్

సంబంధిత భూములను ఆశ్రమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అక్కడి నిర్మాణాలకు ఎలా అనుమతిచ్చారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ప్రశ్నించారు. ఈ విషయమై ఆయన సోమవారం జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది ప్రైవేటు వ్యక్తులు శాంతి ఆశ్రమానికి సంబంధించిన భూముల్లో యోగాశ్రమం పేరుతో ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లు, పార్కింగ్ స్థలాలు, ఆటోమొబైల్ షెడ్లు, పెట్రోలు బంకు లాంటి వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

✦ ఎలాంటి అనుమతులు లేకపోయినా కేవలం ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకొని వాణిజ్య సముదాయాలు నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న సముదాయం పక్కా భవనాలుగా మార్పులు చేస్తున్నారన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా శాంతి ఆశ్రమం నిర్వాహకులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని.. ఎట్టకేలకు వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అక్రమాలకు గురైన భూములను తక్షణ ఖాళీ చేయించి సెప్టెంబర్ నెల నాటికి శాంతి ఆశ్రమానికి ఇవ్వాలని ఇచ్చిన కోర్టు ఆదేశాలను గుర్తు చేశారు. ఈ మేరకు పెట్రోల్ బంక్ భవనం కూల్చివేతలను ప్రారంభించారు. అయితే సంబంధిత నిర్మాణాన్ని పాక్షికంగా కూలగొట్టి వెళ్లిపోయారు.

## ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రైవేటు జాబ్ మేళా పేరుతో ఎస్కేఎం ప్లేస్‌మెంట్స్ అండ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ఎటువంటి కంపెనీలతో ఒప్పందం లేకుండానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలతో మోసం చేయడానికి ప్రయత్నించింది. విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం, పార్వతీపురం గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను ఉద్యోగం వచ్చిందని నమ్మించి ధ్రువపత్రాలు తీసుకుని నగదు కాజేసే ప్రయత్నం చేసింది. మంగళవారం ఉదయం విశాఖలోని దొండపర్తి ప్రాంతానికి వచ్చిన ఆయా ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గురించి తెలుసుకున్న ఎ.పి. నిరుద్యోగ జే.ఎ.సి. రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ స్వయంగా వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్యోగాలకు సంబంధించి ఎటువంటి హామీ లేదని, అంతా ఉత్తుత్తిదేనని తెలుసుకుని నిరుద్యోగులకు తెలిపి మోసపోకుండా నిలువరించారు. నిరుద్యోగులకు వారి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి జాబ్ మేళాకు ఒక తహశీల్దారును మేళాకు పర్యవేక్షణాధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నానని తెలిపారు.


## అరకులో 'ఎన్‌సీసీ' ట్రెక్కింగ్

సింధియా, న్యూస్‌టుడే : ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి మొత్తం 450 మంది నేషనల్ క్యాడెట్ కార్ప్స్ మంగళవారం అరకులోయలో ట్రెక్కింగ్ నిర్వహించారు. ఆంధ్రా డైరెక్టరేట్ బాలికల విభాగం కమాండింగ్ అధికారి గోపేంద్ర సారథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి 25 మంది అర్మీ అధికారులు హాజరయ్యారు. శిబిరంలో భాగంగా క్యాడెట్లు రణజిల్లెడ జలపాతాన్ని సందర్శించారు. ఏపీ-తెలంగాణ డిప్యూటీ డైరెక్టరేట్ జనరల్ బీఎం. రెడ్డి సాహస యాత్రలో పాల్గొన్నారు. శిబిరాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎస్. దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సి. జమాల్‌బాషా తదితరులు సందర్శించారు.


హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

## వాణిజ్య ఎగుమతులకు ప్రోత్సాహం

ఎన్ఏడీకూడలి (కాకానినగర్), న్యూస్‌టుడే: విమానాల్లో వాణిజ్య ఎగుమతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, విశాఖపట్నం విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విమానాశ్రయంలో సీఐఐ ఆధ్వర్యంలో వివిధ సంస్థల ప్రతినిధులు, వాటాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్గో రవాణాకు సంబంధించి వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ సంస్థ అధినేత సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి, సీఐఐ ప్రతినిధులు

## విశాఖ తీరంలో 'మలబార్' విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే : భారత నౌకాదళం ఆధ్వర్యంలో మంగళవారం విశాఖపట్నం తీరంలో 'మలబార్- 2024' సముద్ర విన్యాసాలు ప్రారంభమయ్యాయి.


జపాన్ నౌక జేఎస్ అరియకె

విశాఖలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాకు యుద్ధనౌకలు, సిబ్బందికి నౌకాదళం బ్యాండుతో స్వాగతం పలికారు. హార్బర్ దశలో ప్రారంభమైన విన్యాసాల ద్వారా హిందూ మహా సముద్ర ప్రాంతం, పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థాపన, రక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా కొనసాగుతాయని నేవీ వర్గాలు వెల్లడించాయి. అమెరికా నుంచి 'యూఎస్ఎస్ డ్యూవే' జపాన్ నుంచి 'జేఎస్ అరియకె', ఆస్ట్రేలియా నుంచి 'హెచ్ఎంఏఎస్ స్టార్ట్ ' నౌకలు పాల్గొన్నాయి.

## 'ర్యాగింగ్‌పై ప్రచారం అవాస్తవం'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల ర్యాగింగ్ జరిగిందంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది కావాలని యూనివర్సిటీ ప్రతిష్ఠను భంగపరచడానికి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఏయూలో నియమించిన క్రమశిక్షణ, యాంటీ ర్యాగింగ్ కమిటీలు నిరంతరం పని చేస్తున్నాయన్నారు. ఇటీవల ఆకస్మిక తనిఖీల్లో విద్యార్థినులు గదులు సరిగా ఉంచుకోకపోవడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కొందరిని తరగతుల నుంచి కొద్ది రోజులు బహిష్కరించడం జరిగిందన్నారు. బహిష్కరణకు, ర్యాగింగ్‌కు ఎలాంటి సంబంధం లేదని వివరించారు.

# భీమిలి

## సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - సత్యం సుందరం
రాములమ్మ- దేవర
తాతా - దక్షిణ, సప్తగిరి- శ్వాగ్
చోటుమహరాజ్ (ఆనందపురం) - దేవర

## నూతన కార్యవర్గం

భీమునిపట్నం: భీమిలి మరిడిమాంబ ఆలయంలో మంగళవారం భీమిలి నాగవంశ సంక్షేమ సంఘం ఎన్నికలు జరిగాయి. సంఘాధ్యక్షునిగా కంటుభుక్త ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శిగా గాడు సన్యాసినాయుడు, కోఆర్డినేటరుగా కనకల అప్పలనాయుడు, కోశాధికారిగా సంకురుబోతు సూరిబాబు ఎన్నికయ్యారు. ఇతర పదవులకు అప్పికొండ నూకరాజు, కనకల సన్నిబాబు, లచ్చుబుగత గణపతిరావు, కాళ్ల శ్రీనివాసరావు ఎంపికయ్యారు. వీరితో నిర్వాహకులు ప్రమాణ స్వీకారం చేయించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

**80086 11711, 99122 22247**

**సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య**

ఎండాడ, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే

**సమస్య:** వైఎల్పీ లేఅవుట్(ఎండాడ) నుంచి బీచ్‌కు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు, ఎండాడ

**సమాధానం:** వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. -సురేష్, విద్యుత్ ఏఈ

**సమస్య:** రేఖవానిపాలెం ప్రధాన మార్గంలో నెల రోజులుగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. -రేఖా కరుణ (రేఖవానిపాలెం)

**సమాధానం:** సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. -పి.శ్రీనివాసరావు (విద్యుత్తుశాఖ ఈఈ)

**సమస్య:** ఈనాడు(సాగర్‌నగర్) లేఅవుట్‌లో వీధి దీపాలు వెలగక రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. -స్థానికులు, ఈనాడు లేఅవుట్

**సమాధానం:** విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. -సురేష్, విద్యుత్ ఏఈ

## చెరువులా.. మురికి కూపాలా..!

కొమ్మాది, న్యూస్‌టుడే

**గత వైకాపా ప్రభుత్వం చెరువుల సంరక్షణకు పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రస్తుతం అవి నీటి సామర్థ్యం తగ్గిపోయి వ్యర్థాలతో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు కొన్ని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కూటమి పాలకులు తక్షణమే వీటిపై దృష్టి సారించి పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.**



కళావిహీనంగా నగరంపాలెం చెరువు

★ గతంలో తెదేపా ప్రభుత్వం బక్కన్నపాలెం చెరువు అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించింది. అందులో రూ.40లక్షలతో పూడిక తీసి చుట్టూ రాళ్లతో గట్టు నిర్మించింది. మిగతా రూ.60లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టే సమయంలో వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ పనులు అక్కడితో నిలిచిపోయాయి. గడచిన అయిదేళ్లలో 6వ వార్డులోని కొమ్మాది చెరువును అమృత్ 2.0 పథకం కింద ఆధునికీకరించినా 5, 7 వార్డుల్లోని చెరువుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురై అధ్వానంగా మారాయి.


★ ఒకప్పుడు పంటపొలాలకు, స్థానికుల అవసరాలకు నీటిని అందించిన బొట్టవానిపాలెం, నగరంపాలెం చెరువులు ఇప్పుడు ఆక్రమణలకు గురయ్యాయి. పూడిక పేరుకుపోయి, పరిసర నివాసాల వాడుక నీటితో మురికికూపాలుగా మారుతున్నాయి.



బొట్టవానిపాలెం చెరువు దుస్థితి

**గత పాలకులు పట్టించుకోలేదు :** గత వైకాపా ప్రభుత్వంలో ప్రతి కౌన్సిల్‌లో చెరువులను ఆధునికీకరించాలని, ఆక్రమణలు తొలగించాలని విన్నవించినా గత పాలకులు పట్టించుకోలేదు. కొమ్మాది చెరువు తప్ప.. మధురవాడ ప్రాంత చెరువులన్నింటినీ నిర్లక్ష్యంగా వదిలేశారు. ఉమ్మడికూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటికి మంచి రోజులు రానున్నాయి.

-మొల్లి హేమలత, తెదేపా 5వవార్డు కార్పొరేటర్



**నివేదికలు తయారు చేస్తున్నాం:** జోన్2 పరిధిలోని చెరువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సంబంధిత కార్పొరేటర్లు వినతులిచ్చారు. ఆ మేరకు వీటి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించా.

-పి.సింహాచలం, జెడ్సీ, జోన్-2

## అమ్మవారి సన్నిధిలో సీపీ

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఏడోవార్డు టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవిని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బంగారు సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన దీపారాధన కార్యక్రమాన్ని సీపీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు.



మానం ఆంజనేయులు నగర్‌లో.. కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు



విజయదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో మహిళల దీపారాధన



మందిరంలో దీపారాధన ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

## అవీ ఇవీ

● **నేడు కోలాటం పోటీలు**

పద్మనాభం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీమతి గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా సందర్భంగా బుధవారం మండల స్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి పారితోషికంతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు పోటీల నిర్వాహక ప్రతినిధులు పేర్కొన్నారు.

● **కారు ఢీకొని మహిళ దుర్మరణం**

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలో మామిడిలోవ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు ఆనందపురం సీఐ సీహెచ్.వాసునాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. మామిడిలోవ గ్రామానికి చెందిన పినిశెట్టి అప్పలకొండ(59)కు పెళ్లి జరిగిన కొన్నేళ్లకే భర్త మృతి చెందడంతో గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవించేది. తర్వాత స్థానికంగా కూరగాయలు విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె పెందుర్తి వెళ్లి రాత్రి తిరిగి గ్రామానికి చేరుకునే క్రమంలో సేవా మార్గం నుంచి జాతీయ రహదారి దాటుతుండగా ఆనందపురం వైపు నుంచి వెళ్తున్న ఓ కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతురాలు అప్పలకొండకు సంతానం లేకపోవడంతో శొంఠ్యాంలో ఉంటోన్న ఆమె చెల్లెలికి సమాచారం అందించారు.

● **లారీని ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు**

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలో జాతీయ రహదారిపై లచ్చన్నపేట సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. పలాసలో జీడి పప్పు కొనుగోలు చేసి కారులో తీసుకెళ్తుండగా అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది. యజమాని కృష్ణ స్వల్పగాయాలతో బయటపడగా, కారు నడుపుతున్న శ్రీనివాసరావు కాలు విరిగింది. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు.

● **నేడు ఆశీలు వసూళ్లకు వేలంపాటలు**

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని జీవీఎంసీ మార్కెట్లలో వ్యాపారుల నుంచి రోజువారీ ఆశీలు వసూలు చేసుకోటానికి బుధవారం ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో వేలంపాటలు నిర్వహించనున్నారు. స్థానిక లాల్‌బహుదూర్‌శాస్త్రి, సూర్యనారాయణ మార్కెట్లలో 2025 మార్చి 31వ తేదీ వరకు ఆశీలు వసూలు చేసుకునేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారు. గతంలో పలుమార్లు నిర్వహించినా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో జీవీఎంసీ సిబ్బందితోనే ఆశీలు వసూలు చేస్తున్నారు. ఈసారి నిర్వహించే వేలం ప్రక్రియకు పాటదారులు ముందుకు రావాలని జెడ్సీ పి.ప్రేమప్రసన్నవాణి కోరారు.

## మహాలక్ష్మీ.. నమోస్తుతే..



భీమిలి కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో.. రాజులింగంపేట వద్ద.. కడకుర్రు ఆలయంలో.. గీతం ఆసుపత్రి ఆవరణలో.. సాగర్‌నగర్ బంగారమ్మ గుడిలో.. గుడ్లవానిపాలెం ఆలయ ప్రాంగణంలో.. తగరపువలస కూడలి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో.. మజ్జివలసలో.. సంగివలసలో..

నియోజకవర్గంలో పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్మాత మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు అనుగ్రహించారు. మరికొన్ని చోట్ల అమ్మవారు వేర్వేరు రూపాల్లో భక్తుల పూజలందుకున్నారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన, దీపారాధన, అన్న సమారాధన వంటివి నిర్వహిస్తున్నారు.

-న్యూస్‌టుడే, సింహాచలం, ఎండాడ, తగరపువలస, ఆనందపురం, గ్రామీణభీమిలి, సాగర్‌నగర్, భీమునిపట్నం, పద్మనాభం, కొమ్మాది



చంద్రంపాలెం జాతరగట్టుపై..



శ్రీదుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన



భీమిలి వైకాపా కార్యాలయంలో..



వేములవలస సత్యకర్మణి ఆశ్రమంలో..



ముత్యమాంబ ఆలయంలో .. తాటితూరులో.. తగరపువలస గొల్లవీధిలో.. మంగమారిపేటలో.. చిప్పాడలో.. ఎండాడ దుర్గాదేవి ఆలయంలో.. విజినిగిరిపాలెంలో.. తొలిపావంచా వద్ద.. పద్మనాభం మండలం మద్ది గ్రామంలో.. కృష్ణంరాజుపేటలో..

## చోరీల నియంత్రణపై దృష్టి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద విధిగా సి.సి.కెమెరాలను అమర్చాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మంగళవారం పోలీసు సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, ఏ.టి.ఎం. సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఏ.టి.ఎం.ను చోరీ చేసిన తీరును వివరించి, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. నగరవ్యాప్తంగా ఉన్న 654 ఎ.టి.ఎం.ల్లో భద్రతా సమస్యలను తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే మొదటి గంట సమయంలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశముంటుందన్నారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం అవసరమన్నారు. డి.సి.పి. అజిత వేజేంద్ర, డి.సి.పి.(క్రైమ్) లతా మాధురి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

## వేడుకగా నిత్య కల్యాణం



సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

## అప్పన్న ఆలయంలో నేటి నుంచి వీరలక్ష్మీ ఆరాధన

సింహాచలం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో బుధవారం నుంచి వీరలక్ష్మీ ఆరాధన జరుగుతుందని అధికారులు తెలిపారు. 13వ తేదీ వరకు జరిగే ఈ పూజల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ బేడామండపంలోని సింహవల్లీ తాయార్ సన్నిధి వద్ద అర్చకులు ఆయుధ పూజలు నిర్వహిస్తారు. వివిధ సందర్భాల్లో స్వామికి అలంకరించే వివిధ ఆయుధాలను చతుర్భుజ తాయార్ సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించడం సంప్రదాయం. 13న విజయదశమి సందర్భంగా స్వామివారు రామావతారంలో కొండ దిగువకు వచ్చి పూల తోటలో శమీ పూజోత్సవంలో పాల్గొంటారు. ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



పూజలందుకున్న అమ్మవారు

### సంప్రదాయబద్ధంగా అమ్మవారి తిరువీధి

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం అప్పన్న ఆలయంలో అమ్మవార్ల తిరువీధి సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.

## అక్రమ కట్టడాల తొలగింపు అంతంతమాత్రమే..

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో పలు వార్డుల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీవీఎంసీ అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలు కొన్నైతే.. నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాలు మరికొన్ని. పదుల సంఖ్యల్లో అక్రమ, అనధికార నిర్మాణాలు పుట్టుకొస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం చోద్యం చూస్తుందే తప్ప చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనం జీవీఎంసీ జోన్-2 కార్యాలయ సమీప వల్లీనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు భవనమేనని పలువురు అంటున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై పలుమార్లు స్థానికులు ఫిర్యాదులు చేయడంతో ఆ నిర్మాణాన్ని కూల్చివేయాలని జెడ్సీ పి.సింహాచలం.. పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శాస్త్రిశబ్నాన్‌కు ఆదేశించారు. ఆ మేరకు మంగళవారం టీపీవో వరప్రసాద్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు మదీనా, అశోక్, సూర్య తదితరులు సంబంధిత నిర్మాణం వద్దకు చేరుకున్నా.. పాక్షికంగా స్లాబుకు రెండు రంధ్రాలు పెట్టి వెనుదిరగడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



## మజ్జివలసలో దీపారాధన

తాటితూరు (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలసలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం దీపారాధన ఘనంగా నిర్వహించారు.

## ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రమేశ్‌నాయుడు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి ఇన్‌ఛార్జి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా కనకల రమేశ్‌నాయుడు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపీడీవో హనుమంతురావు శిక్షణ కోసం విజయవాడ వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీ వరకూ ఈవోపీఆర్డీ రమేశ్‌నాయుడు ఆ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## దాతలకు సత్కారం

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస సంతపేట, కొత్తపేట, పరిసర 14 గ్రామాల ఆరాధ్యదేవత కొత్తమ్మతల్లి ఉత్సవ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారి అన్నసమారాధనకు, అలంకరణలకు, అభివృద్ధికి అన్నివిధాలా సహకరించిన దాతలను ఉత్సవ కమిటీ సత్కరించింది. కమిటీ అధ్యక్షుడు రంగూరి సీతారామదొర, ప్రధాన కార్యదర్శి చేట్ల త్రినాథరెడ్డి, తదితరులు దాతలకు అమ్మవారి ఫొటోలు, జ్ఞాపికలు అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నందిక రమణ, దుక్కా కృష్ణ, ఎర్నింటి రమణ, మేకల శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన దాతలతో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు

## స్కేటింగ్‌లో బాలుడికి రజత పతకం



ఎండాడ, న్యూస్‌టుడే: కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఏపీ స్టేట్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఫ్రెండ్స్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన **ఒమ్మి తరుణ్** ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. అంతకు ముందు విశాఖలో జరిగిన జోనల్-3 ఛాంపియన్‌షిప్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై స్కేటింగ్ రింక్-5, రింక్-6ల్లో ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా బాలుడిని సంబంధిత అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ చంద్ర, కార్యదర్శి లక్ష్మణ్, శిక్షకులు కృష్ణకుమార్ తదితరులు అభినందించారు.

## గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'..

పద్మనాభం, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే : మండలంలోని కోరాడ, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు గురించి మండల వ్యవసాయాధికారి ఎం.వి.ఎస్.చలం రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరాడ సర్పంచ్ లక్ష్మణరావు, మండల తెదేపా అధ్యక్షుడు కోరాడ రమణ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

★ కాపులుప్పాడ, నిడిగట్టు గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా ఉద్యానశాఖాధికారి కేవీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ అరటి మొక్కల పెంపకానికి 2.5 ఎకరాల విస్తీర్ణానికి తొలి ఏడాది రూ.30వేలు, రెండో ఏడాది రూ.10వేలు రాయితీగా ఇస్తున్నామన్నారు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి, వ్యవసాయాధికారిణి శివకోమలి మండల ఉద్యానశాఖాధికారిణి స్వాతి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మారని తీరు.. మళ్లీ రోడ్డుపైకి వాడుకనీరు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: చేపల తిమ్మాపురం కొండవాలు నివాసితుల తీరు మారడం లేదు. వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కాపులుప్పాడలోని ప్రభుత్వానికి చెందిన కొండవాలులో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. రెండేళ్ల కిందట వీరంతా రోడ్డుపైకి వాడుకనీరు వదలడంతో మధురవాడకు వెళ్లే మాస్టర్‌ప్లాన్ రోడ్డు, బీచ్‌రోడ్డు గుంతలు పడింది. జీవీఎంసీ నిధులతో కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించారు. తాజాగా తుపాను రక్షిత భవనం వైపు ఉన్న సీసీ రోడ్డు పైనుంచి వాడుకనీటిని కిందికి విడిచిపెడుతున్నారు. దీంతో బీచ్‌రోడ్డు, విజ్ఞాన్ విద్యాలయం నుంచి మధురవాడకు పోయే మాస్టర్ ప్లాన్ రోడ్డు అపరిశుభ్రంగా, అధ్వానంగా మారుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కొండవాలు ప్రాంత నివాసాల నుంచి...



మధురవాడ వైపునకు వెళ్లే మాస్టర్‌ప్లాన్ రహదారిపై ఇలా..

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం ద్వారా రహదారి ప్రమాదాలు నివారించవచ్చని ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు సూచించారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణలో భాగంగా మంగళవారం చేపట్టిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ మేరకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ నియంత్రణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరిలోవ సీఐ గోవిందరావు, జీవీపీ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్, ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు, కెప్టెన్ ఉమానాగేశ్వరి, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, రోజా తదితర అధికారులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ రాంబాబు

## నర్సింగ్ విద్యార్థినులకు శిక్షణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)పై గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటేషన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. వివిధ అనారోగ్యాలతో జీవితపు చివరి దశలో ఉండేవారికి ఉపశమన సంరక్షణ అవసరమని వక్తలు పేర్కొన్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 56.8 మిలియన్ల మంది రోగులకు ఈ ప్రక్రియ అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. రోగులు వారి సంరక్షకులు మానసికంగా కుంగిపోకుండా ఉండడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు ముఖ్యాంశాలపై దిశా నిర్దేశం చేశారు. డాక్టర్ కరణ్‌వీర్ సింగ్ మాత్రో, డాక్టర్ వి.అనూష, పి.తనూబ, ఎస్.వి.ఎల్.పద్మకుమారి తదితర నిపుణులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు



## గోతిలో కొమ్మలు...ఇలా ఎన్నాళ్లు

జాలారిపేట కురుపాం కూడలి సమీపంలో మంచి నీటిపైపు లైను లీకై నీరు వృథాగా పోతోంది. దీంతో ఆ ప్రాంతంలో గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రమాదాలు జరగకుండా స్థానికులు కొమ్మల్ని పెట్టాల్సి వచ్చింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

# విశాఖ తూర్పు

## జూదరుల అరెస్టు

ఎం.వి.పి.కాలనీ: ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం మేరకు గురుద్వార దరి ఓ ప్రాంతంలో పోలీసులు దాడులు జరపగా.. జూదమాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.07 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ద్వారకా పోలీసుస్టేషన్‌కు అప్పగించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా** 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

**సమస్య:** ఎంవీపీకాలనీ సెక్టారు-2 బాలాజీపార్కులో వీధి దీపాలు వెలగటంలేదు. – లక్ష్మి

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

## రహదారి ప్రమాదాల నియంత్రణపై అవగాహన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను మంగళవారం మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం, విశాఖ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. ప్రమాదానికి గురై ధ్వంసమైన వాహనాన్ని పలు ప్రాంతాల్లో ఉంచి.. ప్రమాదం జరిగిన తీరు, ప్రాణనష్టం తదితర అంశాలను వివరించారు. మెడికవర్ ఆసుపత్రి తరఫున వైద్యులు అరుణ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, వినయ్, భూషణ్, ప్రవీణ్, రాజశేఖర్, హేమంత్, ట్రాఫిక్ సి.ఐ. కె.ఎస్.ఎన్.వి. ప్రసాద్ ఆసుపత్రి నుంచి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. పలువురు యువతకి చైతన్యం కల్పించారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సి.ఐ. ప్రసాద్

## రాయితీ టమోటాకు బారులు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

బహిరంగ మార్కెట్లో టమోటా ధరలు ఆకాశాన్నంటాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాయితీ టమోటాకు విశేష ఆదరణ లభించింది. ఎంవీపీకాలనీ రైతుబజారులో తొలిరోజు సుమారు 6700 కిలోల మేర విక్రయాలు జరిగాయి. తగ్గింపు ధరలపై కిలో రూ.50కే అందించటంతో వినియోగదారులు బారులు తీరారు. అయితే విక్రయాలు జరిగే డ్వాక్రా సంఘాలకు సంబంధించి వారికిచ్చే మార్జిన్‌పై సరైన స్పష్టత ఇవ్వలేదు.

**తొలిరోజు హోల్‌సేల్ నుంచి...**

ఇటీవల వర్షాల ప్రభావంతో దిగుబడి బాగా తగ్గడంతో నగరానికి వచ్చే టమోటా దిగుమతి పడిపోయింది. దీంతో ధరలు నింగినంటాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.90 వరకు పలికింది. ఇక రైతుబజార్లలో టమోటా దాదాపు రూ.70 నుంచి విక్రయాలు జరిగాయి. కొద్దిరోజులుగా కిలో రూ.65 నుంచి రూ.63 మధ్య ఉంది.

★ రాయితీపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నేతృత్వంలో మంగళవారం నుంచి విక్రయాలు చేపడతామని ప్రకటించారు. ఆ మేరకు ఎస్టేట్ అధికారులు హోల్‌సేల్ మార్కెట్ నుంచి కిలో రూ.60 చొప్పున కొనుగోలు చేసి రైతుబజార్లలో రూ.50కే విక్రయించారు. మిగిలిన రూ.10 భారం ప్రభుత్వం భరించనుంది. తొలిరోజు ఆధార్‌కార్డు చూపించిన వారికి కిలో చొప్పున ఇచ్చారు.



బారులు తీరిన వినియోగదారులు

**నేటి నుంచి కుటుంబానికి 2 కిలోలు చొప్పున..**

★ రాష్ట్ర కార్యాలయం ద్వారా పుంగనూరు నుంచి టమోటా సరఫరా చేయనున్నారు. వాటిని బుధవారం నుంచి రైతుబజార్లకు పంపించి విక్రయాలు చేపట్టనున్నారు. సాధారణంగా ఎండల తీవ్రత, రవాణా తదితర కారణాలతో కొంత మేర టమోటా పాడవుతుంది.



ఆధార్ నమోదు చేసుకుంటున్న సిబ్బంది

★ వాస్తవానికి డ్వాక్రా సంఘాలకు విక్రయించే వాటిపై కిలోకు రూ.2 మార్జిన్ కేటాయిస్తారు. తొలిరోజు కొంత టమోటా పాడైనా ఆ భారం ఎవరు భరిస్తారనేది స్పష్టత లేదు. అయితే విక్రయించిన వారికి ఎలాంటి ఆర్థిక భారం లేకుండా చూస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు.

★ బుధవారం నుంచి అన్ని రైతుబజార్లలో కుటుంబానికి 2 కిలోలు చొప్పున విక్రయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే దీనికి ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

## విశాఖలో బైక్ చోరీ.. తునిలో చైన్‌స్నాచింగ్

### మహిళ మెడలో ఆభరణాలు లాక్కెళ్లిన దుండగులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఎంవీపీ కాలనీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ఖరీదైన బైక్‌ను ఇద్దరు దుండగులు చోరీ చేశారు. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఈ బైక్ చోరీ జరిగినట్లు అక్కడి సీసీ కెమెరాలో దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం సుమారు 100 కి.మీ. దూరంలో కాకినాడ జిల్లా తుని పట్టణానికి అదే బైక్‌పై వచ్చి సంచరించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఓ గ్రామీణ ప్రాంత మహిళను లక్ష్యంగా చేసుకుని దుండగులు మధ్యాహ్నం 3.30 గంటలకు మెడలోని సుమారు 40 గ్రాముల బరువు ఉన్న రూ.2.50 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు లాక్కెళ్లిపోయారు. ఈ చోరీ దృశ్యాలు కూడా దగ్గరలోని ఓ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. విశాఖలో బైక్ చోరీ చేసిన సమయానికి సరిగ్గా 12 గంటల వ్యవధిలో ఇక్కడ చోరీ జరగడం గమనార్హం. మండలంలోని వెలమకొత్తూరు నుంచి పట్టణంలోని వస్త్ర దుకాణానికి వచ్చిన బాధితురాలు లక్ష్మీ తిరుగు ప్రయాణమైన సందర్భంలో ఈ దాడి జరిగింది. దుండగులు విశాఖలో దొంగిలించిన బైక్‌పైనే ఇటు వచ్చి చోరీ చేశారని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. తుని నారాయణ రాజుగారి వీధిలో చోరీ చేశాక మెయిన్‌రోడ్డు నుంచి బెల్లపువీధి వైపు వెళ్లిన దుండగులు మళ్లీ అటు విశాఖ వైపునకు వెళ్లారా? లేక రాజమహేంద్రవరం వైపునకు పయనం అయ్యారా? అనేది సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు.



విశాఖలో బైక్ చోరీ చేస్తున్న దుండగులు

## హరియాణాలో భాజపా గెలుపుపై వేడుకలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రంలో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు లాసన్స్‌బేకాలనీ భాజపా జిల్లా కార్యాలయంలో మంగళవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాణసంచా కాల్చారు. జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పిఠాపురం కాలనీలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.

## అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ

కెఆర్ఎంకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న డి.వెంకటేష్ ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. బాలుర విభాగంలో రజత పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విజయబాబు తెలిపారు. ఈనెల 17 నుంచి గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ కార్యాలయంలో అభినందించారు. వ్యాయామ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ టి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## టమోటా అమ్మకాల పరిశీలన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రాయితీపై టమోటా అమ్మకాలను పౌర సరఫరాల శాఖ అధికారి డి.భాస్కర్ పరిశీలించారు. మంగళవారం ఎంవీపీకాలనీ రైతుబజారులో కిలో టమోటా రూ.50లకు అమ్మకాలు జరుగుతున్న తీరును గమనించారు. వినియోగదారులతోనూ మాట్లాడారు. టమోటా నాణ్యతను పరిశీలించారు. అమ్మకాలకు సంబంధించిన వివరాలను ఎస్టేట్ అధికారి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అధికారులు సైతం పర్యవేక్షించారు.



అమ్మకాలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ భాస్కర్

## మిద్దె తోట వ్యవసాయంపై అవగాహన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ప్రకృతి ఆధారంగా ఇంటిపైకప్పుపై కూరగాయలు, ఆకుకూరలు పండించి ఆరోగ్యంగా జీవించాలని వనమాలి, సి.టి.జి సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. సంస్థ ప్రతినిధులు ఎం.సరిత, అరుణ, జ్యోతి తదితరులు ఎంవీపీకాలనీలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా మిద్దెతోట వ్యవసాయం విధానాన్ని వివరించారు. చీడ, పీడల నివారణపై అవగాహన కల్పించారు. ఎకో వైజాగ్ పేరిట కూరగాయల నారు, విత్తనాలను గ్రీన్‌క్లైమేట్‌టీమ్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అందజేశారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వనమాలి సంస్థ ప్రతినిధులు

## అతిథి గృహాలు, లాడ్జిల్లో తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: అక్రమ కార్యకలాపాల నియంత్రణతో పాటు గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా నగరంలోని పలు లాడ్జిలు, అతిథిగృహాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు జరిపారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోని అతిథి గృహాలు, లాడ్జిలకు వెళ్లిన పోలీసు అధికారులు రికార్డులు పరిశీలించారు. గదుల్లో ఉంటున్న వారి వివరాలను తెలుసుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్.ఐ. భాస్కర్

## హస్తకళా, చేనేత వస్త్రాల ప్రదర్శన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం (పోలమాంబ గుడి పక్కన)లో హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇందులో వస్త్రాలతో పాటు బ్యాగ్‌లు, బెనారస్ చీరలు, చాందిని చీరలు, పెయింటింగ్స్, లక్నోచికెన్, కార్పెట్స్, పెరల్స్, పశ్చిమ బెంగాల్ కాంతా శారీస్, బెడ్ షీట్స్, కాశ్మీరి డ్రెస్ మెటీరియల్, రాజస్థాన్ బ్యాంగిల్స్, టెర్రాకోటా, ఉడెన్ ఫర్నీచర్ తదితర చేతివృత్తుల ఐటెమ్స్ ఈ ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజయదశమి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



ఏయూ మైదానంలో హస్తకళా, చేనేత వస్త్రాల ప్రదర్శనలో ఒక దుకాణం

## నూతన ట్రాల్‌తో ఇంధనం ఆదా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఫిషింగ్ ట్రాల్ రంగంలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఐసీఏఆర్-సి.ఐ.ఎఫ్.టి (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ) రూపొందించిన ఫిషింగ్ ట్రాల్‌పై మత్స్యశాఖ సహకారంతో ఒక రోజు కార్యశాల నిర్వహించారు. దీన్ని సి.ఐ.ఎఫ్.టి ఇన్‌ఛార్జి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ యు.శ్రీధర్ ప్రారంభించి ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ఆర్.రఘు ప్రకాశ్ వి-ఫారమ్ ఓటర్ బోర్డ్ టెక్నాలజీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ట్రాల్‌కు సంబంధించిన తెలుగు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి డాక్టర్ బి.మధుసూదనరావు, జి.కమల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ యు.శ్రీధర్ తదితరులు

## ఆన్‌లైన్‌లో ఎంఏ కోర్సుకు ప్రవేశాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీలంకలోని శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం సంయుక్త అవగాహన ఒప్పందంలో భాగంగా రెండేళ్ల ఎం.ఎ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ కోర్సు ఉంటుందని, వివరాలకు www.audoa.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరారు.

## మహిళ అదృశ్యం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కొడుకు వేధింపులు భరించలేక ఓ మహిళ అదృశ్యమైంది. దీనికి సంబంధించి మూడోపట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రేషపువానిపాలెంలో నివాసముంటున్న ఓ మహిళ కొంతకాలంగా తన కుమారుడు మద్యానికి బానిసై తీవ్ర ఇబ్బంది పెట్టేవాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో విసిగి చెందిన ఆమె సెప్టెంబర్ 14న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మూడో పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సి.ఐ రమణయ్య ఆధ్వర్యంలో హెచ్.సి మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజయదుర్గమ్మ సారె ప్రసాదం అందజేత

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: మధురవాడ టైలర్స్ కాలనీలో కొలువైన విజయదుర్గమ్మ వారి సారె ప్రసాదాన్ని మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు అశోక్‌కుమార్ అందజేశారు. నవరాత్రి ఉత్సవాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఏటా అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అడవిబాపిరాజు జయంతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు అడివి బాపిరాజు జయంతి నిర్వహించారు. బీచ్‌రోడ్డులో మంగళవారం ఉదయం ఆయన విగ్రహానికి పూలమాలలతో పలువురు నివాళులర్పించారు. అడివి బాపిరాజు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు సన్మూర్తి తదితరులు ఆయన సేవలను గుర్తు చేశారు.

## డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ ఉమ్మడి జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు మండల విద్యాశాఖాధికారులుగా వెళ్లిన ప్రధానోపాధ్యాయులు గత విద్యాసంవత్సర ఎర్నింగ్ లీవులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్ చంద్రకళ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని (డీఈవో) ఉప విద్యాశాఖాధికారి ఛాంబర్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునన్నారు.

## చోరీల నియంత్రణపై దృష్టి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద విధిగా సి.సి. కెమెరాలను అమర్చాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మంగళవారం పోలీసు సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, ఎ.టి.ఎం. సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎ.టి.ఎం.ను చోరీ చేసిన తీరును వివరించి, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. నగరవ్యాప్తంగా ఉన్న 654 ఎ.టి.ఎం.ల్లో భద్రతా సమస్యలను తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే మొదటి గంట సమయంలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశముందన్నారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం అవసరమన్నారు. డి.సి.పి. అజిత వేజెండ్ల, డి.సి.పి(క్రైమ్) లతా మాధురి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

## డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 5050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆశ్రమ విధానంలో డీఎస్సీ పోటీ పరీక్షకు శిక్షణ ఇవ్వటానికి అర్హత కలిగిన శిక్షణా సంస్థలు, స్టడీ సర్కిళ్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు తెలిపారు. కనీసం గత రెండు డీఎస్సీ ఎంపిక పరీక్షలకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఉండాలని, గత ఎంపికలో కనీసం 100 మంది ఉద్యోగాలు పొంది ఉండాలని, మూడేళ్ల సరాసరి టర్నోవర్ రూ.40 లక్షల వరకు ఉంటే దరఖాసులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

## మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పెంపు

హెచ్‌బికాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీతమ్మధార ఎక్సైజ్ సీఐ బి.నాగవేణి తెలిపారు. ఇందుకు 11వ తేదీ వరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రానికి 95 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. సీతమ్మధార స్టేషన్ పరిధిలో వెంకోజీపాలెం, వెంకోజీపాలెం పెట్రోల్ బంకు ఏరియా, హెచ్‌బీకాలనీ, సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సు వంటి ప్రాంతాలు సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి వస్తాయన్నారు. కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు సిరిపురం బాలల ఏరినా ప్రాంగణంలో జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో డ్రా తీస్తారని తెలిపారు. లైసెన్సు ఫీజు రూ.85 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



సీతమ్మధార ఎక్సైజ్ సీఐ బి.నాగవేణి

## ఆర్టీసీ అధికారిపై చర్యలు తీసుకోవాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (ఆర్టీసీ) అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర కోశాధికారి పీవీవీమోహన్ నేతృత్వంలో మంగళవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖ జిల్లా ఆర్టీసీ అధికారులు.. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని డిపోల్లో సమస్యలను పరిష్కరించాలని నిరసనలు చేపట్టినా ఆర్టీసీ జిల్లా అధికారులు పట్టించుకోలేదని తక్షణమే డీపీటీఓపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంవీఆర్‌మూర్తి, బి.నీలకంఠం, ఎ.కె.శివాజీ పలువురు పాల్గొన్నారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తు న్న ఎన్ఎంయూ నాయకులు

## జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలంటూ బోర్డు ఏర్పాటు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని మూడెకరాల స్థలాన్ని జూనియర్ కళాశాలకు కేటాయించాలని స్థానికులు ఆ స్థలంలో మంగళవారం సాయంత్రం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో దాదాపు రెండు లక్షల మంది నివాసముంటున్నారని... ఎంతోకాలంగా తీరని కలగా ఉన్న జూనియర్ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయాలని స్థానిక నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు కోరారు. ఈ స్థలం గత వైకాపా ప్రభుత్వ హయాంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు అకాడమీ ఏర్పాటుకు కేటాయించారన్నారు. అయితే ఇంత వరకు ఎలాంటి పనులు నిర్వహించని అకాడమి ఇప్పుడు చదును చేస్తున్నారన్నారు. స్థానిక అవసరాలకు ఆ స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. ఇదే విషయమై విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు రెండు నెలల క్రితం వినతి పత్రం కూడా అందించామన్నారు.

## మహాలక్ష్మీ నమోస్తుతే..!

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్మాత.. మహాలక్ష్మీ అవతారంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గంలో అర్చకులు, ఉత్సవ నిర్వాహకులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలుచోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎం.వి.పి.కాలనీ, ఆరిలోవ, మద్దిలపాలెం, మద్దిలపాలెం, విశాలాక్షినగర్



భద్రం పార్కులో పూజలందుకుంటున్న అమ్మవారు




హనుమంతువాక వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



సత్యసాయిలో లక్ష్మీదేవి అవతారంలో..



పాత ఆరిలోవలో..



ఎంవీపీ సెక్టారు-8లో రాజరాజేశ్వరిగా పార్వతీదేవి



వాల్తేరు కూడలిలో మహాలక్ష్మీ అవతారంలో విజయదుర్గ అమ్మవారు



సెక్టార్-4లో ఆంజనేయస్వామికి పూజలు



ఏజీసీ పార్కులో కనకదుర్గ అవతారంలో అమ్మవారు



మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు



పూజలందుకుంటున్న సరస్వతీదేవి



పాతపందులపాలెం వద్ద..



ఆరిలోవ వివేకానంద కాలనీలో కొలువుదీరిన అమ్మవారు



భద్రం పార్కులో సంకీర్తనలు ఆలపిస్తున్న ఆనంద సాయి భక్త బృందం



పీతలవానిపాలెంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



బలరామ్‌నగర్‌లో..

# విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

## రైలు ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చర్యలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికులకు అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ మేరకు భద్రత, సమయపాలన తదితర అంశాలపై రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలమేరకు 'స్పెషల్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రద్దీ నియంత్రణకు ప్రత్యేక రైళ్లు, అదనపు కౌంటర్లు, క్యూ ఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్, ఏటీవీఎం, యాత్రి టికెట్, సువిధ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ తెలిపారు. ఆర్పీఎఫ్, కమర్షియల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రయాణికులు వేచి ఉండే గదులు, పార్సిల్ కేంద్రాలు, ఆహార నాణ్యత తదితర వాటిపైనా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రయాణ సమయంలో ప్రయాణికులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన మిజోరం గవర్నర్


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబ సభ్యులతో గవర్నర్ కంభంపాటి హరిబాబు

గురుద్వారా, న్యూస్‌టుడే: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు మంగళవారం సీతమ్మధారలోని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నివాసానికి విచ్చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కాలికి గాయం కావడంతో పరామర్శించారు. కాసేపు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఎమ్మెల్యే కుమార్తె శ్యామలాదీపిక, అల్లుడు సునీల్‌అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంతో ప్రాణాలకు ముప్పు

■ శిరస్త్రాణం లేకుంటే వాహనం నడపే వారికి మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేసే నిబంధన అమలులోకి వచ్చింది. ఈ విధంగా ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో గత మూడు నెలల్లో వెయ్యికి పైగా వాహనదారుల లైసెన్సులు రద్దు చేశారు.



• గత నెలలో గురుద్వారా 38వ బస్ స్టాప్ ఎదురుగా జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను ట్రావెల్ టీకొట్టడంతో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందింది. ఆమె శిరస్త్రాణం ధరించి ఉంటే కొంత వరకు ప్రాణాపాయం తప్పేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

• ఇటీవల కంచరపాలెంలో ముగ్గురు యువకులు మితిమీరిన వేగంతో వెళుతూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మృతిచెందారు. శిరస్త్రాణం ధరించి ఉంటే గాయాలతో బయటపడేవారు.

గురుద్వారా, న్యూస్‌టుడే

వాహన చోదకుల నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకోవడమే గాక కుటుంబాల్ని రోడ్డున పడేలా చేస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించడానికి కారణాలు సగానికి పైగా శిరస్త్రాణం లేకపోవడమేనని తేటతెల్లమవుతోంది. ఆ విషయం తెలిసినా ప్రాణాన్ని కాపాడే శిరస్త్రాణాన్ని భారంగా భావిస్తూ పక్కన పెట్టేస్తున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు పదే పదే అవగాహన కల్పిస్తున్నా.. వాహన చోదకుల తీరు మారడం లేదు.


శిరస్త్రాణం లేకపోవడంతో రోడ్డు ప్రమాదానికి గురైన మహిళ (పాత చిత్రం)

శిరస్త్రాణం లేకుండా మితిమీరిన వేగంతో వాహనం నడపటం, ట్రిపుల్ రైడింగ్ వంటివి చేస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. వీటి నివారణకు పోలీసులు పలు కార్యక్రమాలు చేపడుతున్నా విఫలమవుతున్నాయి. ద్విచక్ర వాహనదారు, వెనుక కూర్చొనే వ్యక్తి కూడా శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనలు ఉన్నాయి. వెనుక కూర్చున్న వ్యక్తి సంగతి దేవుడెరుగు.. ముందు వాహనం నడిపే వ్యక్తే పట్టించుకోని పరిస్థితులు ఎదురవుతున్నాయి.

గడిచిన ఆరు నెలల్లో ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల సంఖ్య

- 3 మృతులు
- 5 క్షతగాత్రులు
- 2 చిన్నపాటి గాయాలు


కేసులు నమోదు చేస్తున్న ట్రాఫిక్ ఎస్.ఐ భాస్కరరావు (పాత చిత్రం)

### సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి

వాహన చోదకులు శిరస్త్రాణం ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలనేది లక్ష్యం. మనం నిర్లక్ష్యం వహిస్తే కుటుంబానికి శాపం కాకూడదు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలం. జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదు. పోలీసులకు భయపడి కాకుండా రక్షణ కోసం శిరస్త్రాణం ధరించండి.

– భాస్కరరావు (ద్వారకా ట్రాఫిక్ ఎస్.ఐ)

## భారతీయ విద్యాభవన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో ఇటీవల ప్రముఖ లీడ్ ఎడ్‌టెక్ కంపెనీ పాఠశాలలకు నిర్వహించిన జాతీయ స్థాయి 'శిక్షా అవార్డ్స్ -2024' పోటీల్లో సాలగ్రామపురంలోని భారతీయ విద్యాభవన్ పాఠశాల అగ్రస్థానంలో నిలబడి జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు దశల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 2,500కి పైగా లీడ్ భాగస్వామ్య పాఠశాలలు పాల్గొని, తమ శిక్షణలో అత్యుత్తమ విద్యా విధానాల అమలును ప్రదర్శించాయి. మూడు నెలల పాటు కొనసాగిన ఈ పోటీల్లో భారతీయ విద్యాభవన్‌కు జాతీయ విజేతగా శిక్షా అవార్డును నిర్వాహకులు పాఠశాల ప్రిన్సిపాల్ షింపీ కుమారికి అందజేశారు. పాఠశాల యాజమాన్యం, నిబద్ధత గల ఉపాధ్యాయులు, సిబ్బంది వల్లే జాతీయ అవార్డును సాధించగలిగామని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

## చోరీల నియంత్రణపై దృష్టి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద విధిగా సి.సి.కెమెరాలను అమర్చాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మంగళవారం పోలీసు సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, ఎ.టి.ఎం. సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎ.టి.ఎం.ను చోరీ చేసిన తీరును వివరించి, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. నగరవ్యాప్తంగా ఉన్న 654 ఎ.టి.ఎం.ల్లో భద్రతా సమస్యలను తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే మొదటి గంట సమయంలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశముందన్నారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం అవసరమన్నారు. డి.సి.పి. అజిత వేజెండ్ల, డి.సి.పి(క్రైమ్) లతా మాధురి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు టెండర్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ కార్పొరేటర్ల అధ్యయన యాత్ర నిర్వహణకు టెండర్లు ఆహ్వానించారు. స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ సిటీలలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి 20 నుంచి 27 వరకు పర్యటించనున్నారు. కోయంబత్తూరు, మైసూరు, బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన అభివృద్ధిపై అధ్యయనం చేయనున్నారు. మంగళవారం జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం కార్పొరేటర్లకు సమాచారం అందించి, పర్యటనకు ఎవరెవరు వస్తారన్న అంశాలను తెలియజేయాలని కోరారు.

## నేడు రాయితీ టమోటా అమ్మకాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం నుంచి రాయితీ టమోటా కౌంటర్‌లో కిలో రూ.50 చొప్పున అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్టేట్ అధికారి కొండబాబు ఓ ప్రకటనలో తెలిపారు. మనిషికి రెండు కిలోలు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, వినియోగదారులు తప్పకుండా ఆధార్, రేషన్ కార్డుల నకళ్లను కౌంటరులో చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రైల్లో అపరిశుభ్రతపై ఫిర్యాదు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం బయలుదేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్8 బోగీలో కనీస శుభ్రత లేకపోవడంతో దుర్వాసన వస్తోందని ఓ ప్రయాణికుడు 'ఎక్స్' వేదికగా ఫిర్యాదు చేశారు. దానికి తన టికెట్‌తోపాటు, బోగీలోని అపరిశుభ్రతకు సంబంధించిన చిత్రాలను జోడించి వాల్తేర్ డీఆర్ఎం, విశాఖ కలెక్టర్, ఎంపీ తదితరులకు ట్యాగ్ చేశారు.

## కేజీహెచ్ ప్రొఫెసర్‌కు బదిలీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ షౌకత్ అలీని బదిలీ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రొఫెసర్‌గా నియమించారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. * ఆప్తమాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శీలాదీప్‌ను గుంటూరు మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు.

## చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వార్డు సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్న విజయనగరం మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.ఆనందరావు, పి.జె.గణేశ్‌కుమార్, చింతకాయల బంగార్రాజు, ఎన్.వి.సందీప్, అశోక్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్నారని, దీనిపై విచారణ జరిపించాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు.

## వాణిజ్య సముదాయాలకు వేలం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్-3, 4 పరిధిలోని వాణిజ్య సముదాయాలకు 16న వేలం నిర్వహించనున్నట్లు రెవెన్యూ ఉప కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జోన్-3, 4 కార్యాలయాలలో 16న ఉదయం 11 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయాల పర్యవేక్షకులను సంప్రదించాలని కోరారు.

## నిబద్ధతతో పనిచేసే అధికారులకు గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు డిప్యూటీ సీఈఓగా రెండేళ్లు విధులు నిర్వహించి శ్రీకాకుళం బదిలీపై వెళుతున్న డి.సత్యనారాయణను మంగళవారం జెడ్పీ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి, నిబద్ధతతో పనిచేసే అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, డీపీఓ శ్రీనివాసరావు, మూర్తి, త్రినాథ్, మధు, రాధ తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ సీఈఓ సత్యనారాయణను సత్కరిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

## అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని డిపోలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య, కక్షపూరిత చర్యలపై ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు అందజేసింది. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసిన యూనియన్ ప్రతినిధి పీవీవీ మోహన్ మాట్లాడుతూ జిల్లా అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎంవీఆర్ మూర్తి, బి.నీలకంఠం, ఏకే శివాజి, పీజీ పతి, వసంతరావు, చిన్న, ఈశ్వరరావు, సురేష్‌నాయుడు తదితరులున్నారు.


కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ నాయకులు

## మిద్దె తోటల పెంపకంపై మహిళల ఆసక్తి

మురళీనగర్, న్యూస్‌టుడే : ప్రకృతి ఆధారంగా ఇంటి పైకప్పుమీద వ్యవసాయం చేయండి, కూరగాయలు, ఆకుకూరలు పండించి ఆరోగ్యంగా జీవించండి.. అంటూ వనమాలి, సీటీజీ సంస్థలు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నాయి. ఈమేరకు మురళీనగర్‌కు చెందిన సంస్థ ప్రతినిధులు మల్ల సరిత, అరవల అరుణ, జ్యోతి నాదెళ్ల నగరంలోని ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం, పెందుర్తి, ద్వారకానగర్, 1టౌన్, మద్దిలపాలెం, గాజువాక, ఎన్ఏడీ, అక్కయ్యపాలెం, ఎండాడ, కూర్మన్నపాలెం, మురళీనగర్ సెక్టర్-8 ప్రాంతాలలో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు తయారు చేసుకోవడం, చీడపీడల నివారణపై మంగళవారం మురళీనగర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఎకో వైజాగ్‌లో భాగంగా కూరగాయల నారు, విత్తనాలు, గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అందజేశారు. ప్రధానంగా బత్తిలి వంకాయ, గుంటూరు పచ్చిమిర్చి, టమాట, బంతిపూల నారు, గుత్తిబీర, నేతిబీర, చిత్రాడబీర, బెండ, కాకర, ఆకుకూరల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఇంటి ప్రాంగణంలో కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచడంపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.


మురళీనగర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రకృతి ప్రేమికులు

## చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

గురుద్వారా, న్యూస్‌టుడే: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన చలపాక రాజేశ్(24) గత నెల 28వ తేదీన దొండపర్తి ప్రాంతంలో ఇంటిముందు ఉంచిన ద్విచక్ర వాహనాన్ని, తాటిచెట్లపాలెంలో ఓ ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారు ఉంగరాలు, నగదు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి రైల్వేన్యూకాలనీలో పట్టుకున్నారు. అతని నుంచి దొంగిలించిన ద్విచక్ర వాహనం, రెండు బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## బంగారు ఆభరణాలు దొంగిలించిన ఇద్దరికి రిమాండ్

మాధవధార, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని కంచరపాలెం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కంచరపాలెం క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం గోకుల్‌నగర్ ప్రాంతంలో ఎలశెట్టి వసంత నివాసం ఉంటున్నారు. సెప్టెంబర్ 30న ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తుమ్మడపాలెం ప్రాంతానికి చెందిన బొద్దూరు ధనుంజయ్, నక్కవానిపాలేనికి చెందిన కొరిబిల్లి వెంకటేష్ కల్యాణ్ ఆ ఇంట్లో దొంగతనం చేసి బంగారు వస్తువులు దొంగిలించారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 2 తులాల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లనూ పగటి పూట టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతూ ఉంటారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర నాటకం

మాధవధార, న్యూస్‌టుడే: పోర్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోర్టు పించనర్ల ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 'సత్య హరిశ్చంద్ర' అనే పద్య నాటకం అలరించింది. పింఛనర్లలో ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా పోర్టు ఆవిర్భావ దినోత్సవం నాడు వారి ఆధ్వర్యంలో నాటకం ప్రదర్శించడం జరుగుతుందని, పోర్టు ఎఫ్ఏ సీఏఎం డి.రమణ మూర్తి తెలియజేశారు. ఉద్యోగుల, పింఛనర్ల సహకారంతో పోర్టు కళాకారుల అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. భారతదేశంలో విశాఖపట్నం పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, పోర్టు ఛైర్మన్ ఆధ్వర్యంలో ఇటువంటి కళాకారులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు. అంతకు ముందు భాజపా నాయకురాలు శ్యామల దీపిక జ్యోతి వెలిగించి నాటకాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదిరి అప్పారావు, ఏ.నారాయణరావు, కళాకారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


పద్య నాటకంలో ఒక సన్నివేశం

## పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ తగదు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద కార్మిక సంఘ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ ఈ శిబిరంలో పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి తప్ప, ప్రయివేట్ పరం చేయడం తగదని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు నాయుడు, శంకరరావు, గణేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరించవద్దని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ జగదాంబ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేను మాట్లాడుతూ సమర్థవంతంగా నడుస్తున్న ఆసుపత్రిని కావాలనే ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. పోర్టు కార్మిక సంఘాల నాయకులు మంగయ్యానాయుడు, కె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, జక్కన సత్యనారాయణ, కనకారావు, గొర్లె చందు తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరహారదీక్షలు చేస్తున్న పోర్టు కార్మిక సంఘం నాయకులు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరిత కూడలి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, మాసిన గడ్డం, ఎడమ చేతికి స్టీల్ కడియం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఎలక్ట్రికల్ బ్రాంచి విద్యార్థుల సందడి

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచ్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ బ్యాటరీ బైకుల మాన్యుఫాక్చర్ యూనిట్ సీఈఓ విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూనే ఎంచుకున్న బ్రాంచ్‌పై పట్టు సాధించాలన్నారు. తద్వారా ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం ఎలక్ట్రికల్ బ్రాంచ్ విభాగాధిపతి కె.డి.వి.నర్సింహారావుని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరావు, స్టూడెంట్ అడ్వైజరు ఎస్.వి.రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


నర్సింహారావుని సత్కరిస్తున్న విశ్వనాథం, ప్రిన్సిపల్ నారాయణరావు, ఎస్.వి.రమణ తదితరులు

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: వార్డుల్లో పారిశుద్ధ్యంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు అన్నారు. 35వ వార్డులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణశాఖ హెచ్చరికల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, 35వ వార్డు జనసేన అధ్యక్షుడు లంక త్రినాథ్, నాయకులు కోసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న జోన్-4 జెడ్సీ మల్లయ్యానాయుడు

## శ్రీదుర్గాలమ్మకు జేజేలు

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెలంపేట శ్రీదుర్గాలమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా మంగళవారం పూజలందుకున్నారు. నాయకులు సీతంరాజు సుధాకర్, విల్లూరి భాస్కరరావు, బొచ్చరామిరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గురుద్వారా : సీతమ్మధార సాయిబాబా మందిరంలో మహాకాళిగా అమ్మవారు

### వైభవుని దివ్యక్షేత్రంలో దసరా త్రిరాత్రి పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓస్‌కాలనీ కప్పరాడ వైభవుని దివ్యక్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి మూడురోజుల పాటు జరగనున్నాయి. గురువారం పద్మావతి అమ్మవారికి విశేష అలంకరణ, సహస్రనామ కుంకుమార్చన జరగనుందని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు.




అక్కయ్యపాలెం: పాతపోస్టాఫీసు వీధిలోని మాస్టర్ ఇ.కె. ఉచిత హోమియో వైద్యాలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు


మాధవధార: సీతన్నగార్డెన్స్‌లో శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరణలో అమ్మవారు


సీతంపేట : సీతంపేటలోని శ్రీ పార్వతీశ్వర ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు


కార్పొరేషన్ : మహాలక్ష్మి అలంకరణలో డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి


వన్‌టౌన్: రామజోగిపేటలో గల్లీ బాయ్స్, అంగటిదిబ్బ లక్కీయూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కార్పొరేషన్ : మహా విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయంలోని దుర్గమ్మ పూజల్లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ అధికారులు


కార్పొరేషన్:మహాలక్ష్మి అలంకరణలో డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి


కార్పొరేషన్ : చండీదేవి అలంకరణలో పాతనగరంలోని కన్యకా పరమేశ్వరి


కంచరపాలెం : రెడ్డికంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్ వద్ద నోట్ల దండలతో..


గురుద్వారా : సీతమ్మధార సాయిబాబా మందిరంలో.. గురువాయరప్పన్‌గా శ్రీవారు



మురళీనగర్: సీతారామాలయంలో చండిక అవతారంలో లలితాదేవి, యువతుల నృత్య ప్రదర్శన


కార్పొరేషన్ : దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దక్షిణ నియోజకవర్గం తెదేపా ఇన్ఛార్జ్ సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ భాస్కరరావు



కంచరపాలెం : ఊర్వశికూడలి సమీపంలోని శ్రీదుర్గ మాంబ, శ్రీకుంచుమాంబ అమ్మవార్లను నోట్ల దండలతో అలంకరించిన దృశ్యం


మురళీనగర్ : మాధవధారలో నెలకొల్పిన మహంకాళి ప్రసన్నదేవి దుర్గామాతను సందర్శించుకున్న కూటమి నేతలు

# గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

## పోలీస్‌స్టేషన్ సందర్శన

గాజువాక, న్యూస్‌టుడే : విశాఖ నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చీ మంగళవారం రాత్రి గాజువాక పోలీస్‌స్టేషన్ను సందర్శించారు. శాంతిభద్రతల విభాగంలో రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ ఫిర్యాదులు, పరిష్కార మార్గాలపై అడిగి తెలుసుకున్నారు. జోన్-2 డీసీపీ తుహిన్ సిన్హా, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, శాంతిభద్రతల విభాగం సీఐ పార్థసారథి పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న సీపీ శంకబ్రత బాగ్చీ



పనులు చేస్తున్న సిబ్బంది

## చకచకా విస్తరణ పనులు

మల్కాపురం, న్యూస్‌టుడే : యారాడ ఘాట్‌రోడ్డు విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. మంగళవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పనుల పురోగతిపై ఆరా తీసి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు. పర్యాటకులు, యారాడ గ్రామస్థుల సౌకర్యార్థం ఘాట్‌రోడ్డులో వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

సమస్య : కణితిరోడ్డు గొంతెనవానిపాలెంలో వీధి కాలువలు పూడికతో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. –వరహాలు, కణితిరోడ్డు

సమాధానం : సిబ్బందిని పంపి శుభ్రత పనులు చేయిస్తాం. –డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

**స్పందనకు వందనం**

న్యూస్‌టుడే, గాజువాక: గాజువాక శివారు కాలనీల్లో పడకేసిన వీధి దీపాలపై సమస్యలపై వార్తలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించి... మరమ్మతులు చేయించారు.

# తూట్లు పొడిచి.. పాట్లు మిగిల్చి..!

## అయిదేళ్లుగా సాగుతున్న యూజీడీ పనులు

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

**ఒకటి కాదు, రెండు కాదు... అయిదున్నరేళ్లుగా ఆయా కాలనీలను కష్టాలు వదలడం లేదు. ఇళ్లలో ఉండే వారు వీధుల్లోకి రావాలంటే గుండెలు అరచేతో పట్టుకుని హడలిపోతున్నారు. అభివృద్ధి పనుల పేరిట రహదారులను ఇష్టానుసారంగా తవ్వేడంతో... రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**



వియ్యపువానిపాలెం మార్గంలో..

భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ(యూజీడీ) ప్రాజెక్టు పనులు పూర్తికాక... నడిరోడ్లపై ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు పట్టించుకోవడం లేదు. గత వైకాపా పాలనలో అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడివనులు అక్కడే నిలిచిపోయాయి.

**ఇదీ పరిస్థితి..:** 2018-19లో గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో యూజీడీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గాజువాక పరిధిలో సగం కాలనీలు పూర్తిగా లోతట్టు ప్రదేశంలో ఉండడంతో తరచూ మురుగు నీటి ముంపు సమస్య తలెత్తడంతో అధికారులు యూజీడీకి ప్రతిపాదించారు.

● 20 వార్డుల్లో విస్తరించి ఉన్న గాజువాకలో 12 కాలనీల్లో యూజీడీ పనుల పేరుతో రోడ్ల మధ్యలో తవ్వేసి, మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేసి, ఇంటర్ లింకేజ్ ఇవ్వకుండా పనులు ఆపేశారు. గత వైకాపా ప్రభుత్వంలో గుత్తేదారులకు నిధులు చెల్లించకపోవడంతో... ఆయా పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. పైగా గాజువాక పరిసర ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఎక్కువవడంతో పనులు చేపట్టలేమంటూ గుత్తేదారులు చేతేలెత్తేశారు.



దారి మధ్యలో తవ్వి వదిలేసి..

**ఎక్కడికక్కడ గోతులు..**

నిత్యం ప్రజలు వినియోగించుకునే రహదారుల మధ్యలో ఉన్న యూజీడీ గోతులు, అసంపూర్తి మ్యాన్‌హోల్స్... మృత్యు కుహరాల్లా తయారయ్యాయి. దీంతో రాకపోకలు సాగించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

● ఆటోనగర్ కెనరా బ్యాంకు సమీపంలో, శ్రీనగర్, చినగంట్యాడ, వడ్లపూడి, పెదగంట్యాడ ప్రాంత యూజీడీ గోతుల వద్ద గతంలో పలు ప్రమాదాలు జరిగాయి.

**ప్రభావిత ప్రాంతాలివి..:** గాజువాక హైస్కూల్ రోడ్డు, జోగవానిపాలెం, పంతులుగారి మేడ, డ్రైవర్స్ కాలనీ, ఎల్‌వీఎస్‌నగర్, టీవీఎన్ కాలనీ, శ్రామికనగర్, కంచుమాంబకాలనీ, శ్రీనగర్, వడ్లపూడి, పెదగంట్యాడ ఉక్కు నిర్వాసితకాలనీ, వుడాకాలనీ, ఇతర లోతట్టు ప్రాంత కాలనీలు.



హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డు పక్కన గొట్టాలు

## ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు



జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని ఆక్రమించి దుకాణాల ఏర్పాటుతో, సీసీరోడ్డు నిర్మించారు. ఈ సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో 'ఆక్రమణలకు అడ్డేది' శీర్షికతో కథనం ప్రచురితమైంది. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి...

**ఈనాడు కథనానికి స్పందన**

సీసీరోడ్డును తవ్వేసి, దుకాణాన్ని తొలగించారు. అయితే గ్రీన్‌బెల్ట్ స్థలానికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, ఎన్‌ఏడీకూడలి (కాకానినగర్)

## సంక్షిప్త సమాచారం..

■ **వినతిపత్రం అందజేత**

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో నడక మైదానాన్ని అభివృద్ధి చేయాలని 79వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు జి.కనకరావు కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళల కోసం ఓపెన్ జిమ్ అందుబాటులోకి తీసుకొచ్చి, మైదానంలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్థానిక వార్డు క్లబ్ అధ్యక్షుడు మడగల నర్సింగరావు, తెదేపా నాయకుడు జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

■ **ఆక్రమణలు తొలగించాల్సిందే..: సీఐ**



సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం నడక మార్గాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర నిర్మాణాలు తొలగించుకోవాలని ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... మల్కాపురం, ఆర్సీపురం, శ్రీహరిపురం, కోరమండల్ గేటు పరిసరాల్లో నడక మార్గాలను ఆక్రమించడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెండు మూడు రోజుల్లో వ్యాపారులే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

■ **కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు టెండర్లు**

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ కార్పొరేటర్ల అధ్యయన యాత్ర నిర్వహణకు టెండర్లు ఆహ్వానించారు. స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి 20 నుంచి 27 వరకు పర్యటించనున్నారు. కోయంబత్తూరు, మైసూరు, బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన అభివృద్ధిపై అధ్యయనం చేయనున్నారు. మంగళవారం జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం కార్పొరేటర్లకు సమాచారం అందించి, పర్యటనకు ఎవరెవరు వస్తారన్న అంశాలను తెలియజేయాలని కోరారు.

■ **నూతన బోరు ఏర్పాటు**

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 88వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ శ్మశానవాటికలో నూతన బోరు ఏర్పాటుకు మంగళవారం కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేశారు. కాలనీవాసుల అవసరార్థం ఏర్పాటు చేస్తున్న బోరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డు నాయకులు ఉరుకూటి శ్రీనివాసరావు, ఎం.రాము, ఎం.నర్సింగరావు, శ్రీనివాసరావు, రాజు, రాము పాల్గొన్నారు.

■ **ఉచిత నేత్ర వైద్య శిబిరం**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నేత్ర వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు సూచించారు. మంగళవారం వికాస్‌నగర్ సచివాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ప్రత్యేక కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

■ **రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి**

కరాస, న్యూస్‌టుడే : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మర్రిపాలెం పాసింజర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై ఎక్కే.అబ్దుల్ వివరాల ప్రకారం... తెల్లవారుజామున జరిగిన ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు 45 ఏళ్ల వయస్సు, 5.5 అడుగుల ఎత్తున్న వ్యక్తి కుడిచేయిపై 'రవి' అనే పచ్చబొట్టు రాసి ఉంది. వివరాలు తెలిసిన వారు విశాఖ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

■ **చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు**

గురుద్వారా, న్యూస్‌టుడే: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన చలపాక రాజేశ్(24) గత నెల 28వ తేదీన దొండపర్తి ప్రాంతంలో ఇంటిముందు ఉంచిన ద్విచక్ర వాహనాన్ని, తాటిచెట్లపాలెంలో ఓ ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారు ఉంగరాలు, నగదు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి రైల్వేన్యూకాలనీలో పట్టుకున్నారు. అతని నుంచి దొంగిలించిన ద్విచక్ర వాహనం, రెండు బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## గంజాయి నిందితుల అరెస్టు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెం సమీప రాజీవ్‌నగర్‌లో అద్దె ఇంట్లో నిల్వ ఉంచిన 50 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 8 మందిని అరెస్టు చేయగా, వారిలో ఇద్దరు మహిళలు, ఓ బాలిక ఉన్నారని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. వారి నుంచి ఓ ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకుని, ఏడుగుర్ని న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు. బాలికను జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. నిందితుల్లో ఇద్దరు అల్లూరి జిల్లాకు, ముగ్గురు అనకాపల్లి జిల్లాకు, ఒకరు తూర్పుగోదావరి జిల్లాకు, ఇద్దరు ఒడిశాకు చెందిన వారు ఉన్నారు.



**టమాటాకు బారులు**

మర్రిపాలెం రైతుబజార్‌లో మంగళవారం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రాయితీ ధరపై టమాటాలు విక్రయించారు. కొనుగోలుకు వినియోగదారులు బారులు తీరిన చిత్రమిది. –న్యూస్‌టుడే, కరాస

## ఉత్తమ ప్రతిభకు గుర్తింపు



పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ నెల్లిముక్కు కాలనీకి చెందిన **యెల్లేటి తేజస్వి** 'యంగ్ సైంటిస్ట్' అవార్డుకు ఎంపికయ్యారు. ఉక్కు ఉద్యోగి యెల్లేటి శ్రీనివాస్, దుర్గాదేవి దంపతుల కుమార్తె అయిన తేజస్వి హైదరాబాద్ కేంద్ర వ్యవసాయ శాఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌లో సైంటిస్టుగా పని చేస్తున్నారు. వచ్చేనెల 5న హైదరాబాద్‌లో జరిగే రెండో ప్రపంచ వ్యవసాయ సదస్సులో ఆమెకు యంగ్ సైంటిస్టు అవార్డు అందజేయనున్నారు. వ్యవసాయ విభాగంలో చేసిన పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు గుర్తింపు దక్కిందని తేజస్వి తెలిపారు.

## ఫోకస్ అల్లుకున్న నిర్లక్ష్యం..!



పారిశ్రామిక ప్రాంతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెర్మినల్ రోడ్డులో హైఓల్టేజీ విద్యుత్తు తీగలు బిగించి ఉన్న ఎత్తయిన టవర్లపైకి పచ్చని పాదులు ఎగబాకాయి. వెంటనే వాటిని తొలగించకపోతే... తీగల్ని తాకే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తీగల్ని తొలగించాలని వారు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సింధియా



డ్రైవర్స్‌కాలనీలో..



చినగంట్యాడలో..



అగనంపూడి కూడలిలో..



పెదమడకలో..



కణితి గవరవీధిలో..



బాపూజీనగర్‌లో..



కొత్తపాలెంలో..



61వ వార్డులో..

# రాజరాజేశ్వరి.. మహా శుభకరి..!

**అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాజువాక, విశాఖ పశ్చిమం పరిధిలోని ఆలయాలు, మండపాల్లో అమ్మవార్ల విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించారు. ఎల్‌వీనగర్‌లో రాజరాజేశ్వరిగా, పెదగంట్యాడ వాంబేకాలనీ, డ్రైవర్స్‌కాలనీలో ధనలక్ష్మిగా, సాగరగిరిపై లలితాదేవిగా, గొల్లకంచరపాలెం, దుర్గానగర్‌లో శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 61, 62 వార్డుల పరిధిలో నిర్వహించిన అమ్మవారి సారె ఊరేగింపులో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం



ప్రకాశ్‌నగర్‌లో సారె ఊరేగింపులో ఎమ్మెల్యే గణబాబు



హెచ్‌బీకాలనీలో..



ఎల్‌వీనగర్‌లో...



వాంబేకాలనీలో..



మిందిలో..



సాగరగిరిపై..



గొల్లకంచరపాలెంలో..



అక్కిరెడ్డిపాలెంలో..

## బకాయిలు చెల్లించాలని డిమాండ్

గాజువాక: జీవీఎంసీలో ఆప్కోస్ ద్వారా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, సభ్యులు నక్క నాగరాజు, సోమాదుల గణేశ్ మాట్లాడారు. 2022 జనవరి నుంచి 2024 జులై వరకూ ప్రతి నెలా పలు వార్డుల్లో అనేక మందికి జీతాలు అందలేదని, వారందరికీ తక్షణమే చెల్లింపులు చేయాలని కోరారు. అనంతరం ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతులు అందజేశారు.



నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

## సామాజిక సేవలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న చిన్నారావు, పక్కన పల్లా తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే : ఉద్యోగ సంఘాల సభ్యులు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం గాజువాక తెదేపా కార్యాలయంలో జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పల్లాను సత్కరించారు. ఉద్యోగ సంఘాల సమస్యల్ని పరిష్కరిస్తామని పల్లా హామీ ఇచ్చారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పెగడ చిన్నారావు అధ్యక్షత వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి రాజారావు, డొక్కర శ్రీనివాస్, సభ్యులు బాబూరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## మద్యం మత్తు వదిలించారు..!

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు మంగళవారం గోపాలపట్నం పెట్రోల్‌బంకు కూడలి, శ్మశానవాటిక కూడలి, అడవివరం, కొత్తపాలెం అండర్‌పాత్‌వే బ్రిడ్జి, బాజీకూడలి పరిసరాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వ్ ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఇటీవల కాలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరచగా... న్యాయమూర్తి రూ.1.84 లక్షల జరిమానా విధించారని తెలిపారు.



గోపాలపట్నంలో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## 'కనీస పింఛను రూ.9 వేలు చెల్లించాలి'



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

కరాస, న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరికీ 'ఈపీఎఫ్-95' కింద కనీస పింఛను రూ.9వేలు చెల్లించాలని ఆల్ ఇండియా పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(ఏపీఆర్‌పీఏ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని ప్రాంతీయ భవిష్యనిధి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇదే సమస్యపై కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నా... కేంద్రం స్పందిచకపోవడం బాధాకరమని, సమస్య పరిష్కారానికి 10వ తేదీన దేశవ్యాప్తంగా ధర్నాలు చేపడుతున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరాజు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై భవిష్యనిధి కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## ఎన్నికల విజేతలకు సత్కారం



విజేతలను సన్మానిస్తున్న కేటీబీ అసోసియేషన్ సభ్యులు

ఎన్‌ఏడీ కూడలి (కాకానినగర్), న్యూస్‌టుడే : నేవల్ డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికల్లో కేటీబీ అసోసియేషన్‌కు చెందిన రెడ్డిపల్లి యోగిత, ఎం.శ్రీనివాస్, ఎన్.జగదీశ్ విజయం సాధించారు. మంగళవారం 90వ వార్డు కాకానినగర్‌లోని నేవల్ డాక్‌యార్డు కేటీబీ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ... ఉద్యోగుల సమష్టి కృషితోనే గెలుపు సాధ్యమైందన్నారు. అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి భాస్కరరావు, సభ్యులు విజయ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్, రవికుమార్, మహేశ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌లో దసరా వేడుకలు



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న సుధాకర్

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : దసరా సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు పండగలు, సంస్కృతి, సంప్రదాయాలపై నేటి విద్యార్థులు అవగాహన పెంచుకుని.. వాటిని భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ జె.సుధాకర్, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ సతీష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటరమేశ్, తదితరులు

గోపాలపట్నం, ఎన్‌ఏడీకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో రూ.18.90 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు మంగళవారం కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శంకుస్థాపన చేశారు. ప్రజా పనుల విభాగం ఈఈ రత్నాకర్, ఏఈ వెంకటలక్ష్మి, వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

★ జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్, ఏపీఎస్ఈబీకాలనీలో సుమారు రూ.19.90 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే పనులకు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.